మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...


# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక


మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

ఆదివారం SUNDAY 26-10-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 ‖ సంచిక: 116 Issue: 116

26 అక్టోబర్ 2025 - ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు కార్తీక మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:16 సూర్యాస్తమయం - సా. 5:44 తిథిః పంచమి ఉ. 6:04o వరకు తరువాత షష్ఠి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం జ్యేష్ఠ ఉ. 10:38 వరకు తరువాత మూల యోగం శోభన ఉ. 6:43 వరకు కరణం బవ సా. 4:57 వరకు భాలవ ఉ. 6:04o వరకు వర్జ్యం రా. 7:39 నుండి రా. 9:26 వరకు దుర్ముహూర్తం సా. 4:12 నుండి సా. 4:57 వరకు రాహుకాలం సా. 4:18 నుండి సా. 5:44 వరకు యమగండం మ. 12:00 నుండి మ. 1:26 వరకు గుళికాకాలం మ. 2:52 నుండి సా. 4:18 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:40 నుండి తె. 5:28 వరకు అమృత ఘడియలు లేదుజి అభిజిత్ ముహూర్తం ఉ. 11:37 నుండి మ. 12:22 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com



## త్వరలో ఫోల్డబుల్ ఐఫోన్

### 2026 చివర్లో మార్కెట్లోకి...

స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో సంచలనం సృష్టించేందుకు టెక్ దిగ్గజం యాపిల్ సిద్ధమవుతోంది. 2026 చివరి నాటికి తన తొలి ఫోల్డబుల్ ఐఫోన్‌ను విడుదల చేయాలని భావిస్తోంది. ఈ పరిణామం ఫోల్డబుల్ ఫోన్ల మార్కెట్‌ను పూర్తిగా మార్చేయడమే కాకుండా, వినియోగదారుల అంచనాలను కొత్త స్థాయికి తీసుకెళ్తుందని టెక్నాలజీ రీసెర్చ్ సంస్థ 'కౌంటర్‌పాయింట్' తన -2 వ పేజీలో...





## కండ్లు చెప్పే రోగం!

### కంటి రక్తనాళాల స్కాన్‌తో గుండె జబ్బుల ముప్పు గుర్తింపు

### శరీర వృద్ధాప్య వేగాన్నీ అంచనా వేయొచ్చన్న పరిశోధకులు

### 74,000 మంది రెటీనా స్కాన్లు, జన్యు డేటా విశ్లేషణ

సాధారణ కంటి పరీక్షతో ఒక వ్యక్తికి గుండె జబ్బులు వచ్చే ప్రమాదాన్ని, వారి శరీరం ఎంత వేగంగా వృద్ధాప్యం చెందుతుందో అంచనా వేయవచ్చని కెనడా పరిశోధకులు తమ తాజా అధ్యయనంలో కనుగొన్నారు. కంటిలోని రెటీనాలో ఉండే సూక్ష్మ రక్తనాళాలను స్కాన్ చేయడం ద్వారా శరీరంలోని మొత్తం రక్త ప్రసరణ వ్యవస్థ ఆరోగ్యాన్ని, జీవసంబంధమైన వృద్ధాప్య స్థితిని తెలుసుకోవచ్చని ఈ పరిశోధన తేల్చింది.

న్యూయార్క్: ఈ అధ్యయన వివరాలు "సైన్స్ అడ్వాన్సెస్" అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. మెక్‌మాస్టర్ యూనివర్సిటీకి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ మేరీ పిగెర్ మాట్లాడుతూ, "శరీరంలోని రక్త ప్రసరణ వ్యవస్థను బయటి నుంచి నేరుగా చూసేందుకు కళ్ళు ఒక ప్రత్యేకమైన, సులువైన మార్గాన్ని అందిస్తాయి. రెటీనాలోని రక్తనాళాల్లో వచ్చే మార్పులు, శరీరంలోని ఇతర చిన్న రక్తనాళాల్లో జరిగే మార్పులను ప్రతిబింబిస్తాయి" అని వివరించారు. ఈ అధ్యయనం కోసం పరిశోధక తరువాయి 2 వ పేజీలో...

## ఆధార్ లింక్ చేయకపోతే జీతాలు బంద్

### తెలంగాణ ఉద్యోగుల వేతనాలకు ఆధార్ లింక్ తప్పనిసరి

### నిబంధన పాటించని ఉద్యోగుల జీతాలు నిలిపివేస్తామని హెచ్చరిక

### రాష్ట్రంలో 10.14 లక్షల మంది ఉద్యోగులపై ఈ నిర్ణయ ప్రభావం




తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ఆర్థిక శాఖ కీలకమైన హెచ్చరిక జారీ చేసింది. ఉద్యోగులందరూ తమ ఆధార్ వివరాలను ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ పోర్టల్ (ఐఎఫ్ఎంఐఎస్)తో తప్పనిసరిగా అనుసంధానం చేసుకోవాలని స్పష్టం చేసింది. ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు అక్టోబర్ 25 అర్ధరాత్రి వరకే గడువు విధించింది. గడువులోగా ఆధార్ వివరాలు నమోదు చేయని ఉద్యోగులకు ఈ నెల జీతాల చెల్లింపు నిలిపివేస్తామని తేల్చి చెప్పింది. మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఈ ఆదేశాలు జారీ అయ్యాయి.

హైదరాబాద్, అక్టోబర్ 25 (ఈవార్తలు): రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో కలిపి సుమారు 10.14 లక్షల మంది శాశ్వత, తాత్కాలిక ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరందరి పేరు, హోదా, ఆధార్, ఫోన్ నంబర్ వంటి వివరాలను ప్రతి నెలా 10వ తేదీలోగా ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్‌లో అప్‌డేట్ చేయాలని గత నెలలోనే ఆర్థిక శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే, ఈ నెల 16వ తేదీ నాటికి సగం మంది ఉద్యోగులు కూడా తమ వివరాలను నమోదు చేయలేదు. దీంతో ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. వివరాలు సమర్పించని వారి జీతాల బిల్లులను ప్రాసెస్ చేయవద్దని స్పష్టం చేసింది. ఈ నిర్ణయం వెనుక ప్రధానంగా ఉద్యోగుల వివరాల్లో పారదర్శకత తరువాయి 2 వ పేజీలో...



భావోద్వేగ అసంతృప్తి, వ్యక్తిగత అవసరాలు తీర్చకపోవడం, శారీరక, మానసిక సాన్నిహిత్యం లేకపోవడం, వివాహేతర యాప్‌ల వాడకంతో దేశవ్యాప్తంగా వివాహేతర సంబంధాలు పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా ఐటీ, వైద్య రంగాలవారిలో ఇలాంటి ధోరణి అధికంగా కనిపిస్తోంది. తాజాగా, ఓ సర్వే ఇదే విషయాన్ని తేల్చింది.

## పరాయి మోజు!

### దేశంలో పెరుగుతున్న అక్రమ సంబంధాలు.. వివాహేతర సంబంధాల్లో బెంగళూరు నం.1

### తర్వాతి స్థానాల్లో ముంబై, కోల్‌కతా, ఢిల్లీ

### ఐటీ, వైద్య రంగాల వారిలోనే అధికం

### కుటుంబానికి టైం ఇవ్వకపోవడమే సమస్య

### విడాకులు, కుటుంబ కలహాలకు కారణమిదే

### గ్లీడెన్ సంస్థ నిర్వహించిన సర్వేలో వెల్లడి




బెంగళూరు, అక్టోబర్ 25 (ఈవార్తలు): ఈ మధ్య కాలంలో వివాహేతర లేదా అక్రమ సంబంధాల కేసులు బాగా పెరిగాయి. ముఖ్యంగా.. బిజీ లైఫ్‌స్టైల్, పెళ్లైన తర్వాత ఒకరి మీద ఒకరికి ఆసక్తి తగ్గడం, కుటుంబ, అనారోగ్య సమస్యలు, ఒత్తిడి, ఇలా అనేక కారణాల వల్ల ఈ విష సంస్కృతి పెచ్చరిల్లుతోంది. ఇలాంటి వివాహేతర సంబంధాల మోజులో పురుషులతోపాటు, మహిళలు కూడా ఎంతకైనా తెగిస్తున్న ఘటనలు చూస్తున్నాం. వాస్తవానికి భారతీయులు ప్రతి సంబంధానికి ఎంతో ప్రాముఖ్యత తరువాయి 2 వ పేజీలో...

### బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.12,562 |
| వెండి (గ్రాము): | రూ.170 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,528 |

### విశ్వవాణి



నిద్ర లేకపోయినా ఒంట్లో కొవ్వు పేరుకుపోతుందని తాజా అధ్యయనం వెల్లడించింది. నిద్రలేమి సమస్యతో మెటబాలిజం దెబ్బతింటుందని, ఆరోగ్యకరమైన ఆహారం తిన్నా పెద్దగా ఉపయోగం ఉండదని తేలింది.

## అమరులకు సారీ!

### అమరవీరుల కోసం పోరాడలేకపోయా

### ఉద్యమకారులకూ క్షమాపణలు చెప్తున్నా.. వారికి దక్కాల్సిన న్యాయం దక్కలేదు

### ప్రభుత్వం తక్షణమే కోటి పరిహారమివ్వాలి.. వచ్చే ప్రభుత్వంతోనైనా తప్పక ఇప్పిస్తా

### తెలంగాణ జాగృతి అధినేత్రి కవిత.. గన్‌పార్క్ వద్ద అమరుల స్థూపానికి నివాళి

తెలంగాణ సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల కుటుంబాలకు, ఉద్యమకారులకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బహిరంగంగా క్షమాపణలు చెప్పారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అమరవీరుల ఆశయాలను పూర్తిగా నెరవేర్చడంలో, ఉద్యమకారులకు అనుకున్న స్థాయిలో న్యాయం చేయించడంలో గట్టిగా కొట్లాడలేకపోయినందుకు తనను మనస్ఫూర్తిగా క్షమించాలని కోరారు.

గన్‌పార్క్/హైదరాబాద్, నిజామాబాద్ అక్టోబర్ 25 (ఈవార్తలు): ' జాగృతి జనం బాట ' పేరుతో 33 జిల్లాలు, 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించేందుకు కవిత ఈ రోజు నిజామాబాద్ బయలుదేరారు. అంతకుముందు నాంపల్లిలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో సుమారు 1200 మంది అమరులయ్యారని గుర్తు చేసిన కవిత.. వారి కుటుంబాలకు పూర్తిస్థాయిలో -2 వ పేజీలో...



## బైక్ స్కిడ్ అవడం వల్లే..!

### బస్సు రాకముందే పడిపోయిన బైక్.. తీద్దామనేలోపే వేగంగా వచ్చిన బస్సు

### బస్సు కిందికి దూసుకెళ్లిన బైక్.. బైక్‌ను ఈడ్చుకెళ్లడంతో ఎగసిన మంటలు.. వీడిన కర్నూలు బస్సు ప్రమాదం మిస్టరీ



కర్నూలు, అక్టోబర్ 25 (ఈవార్తలు): తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర విషాదం నింపిన కర్నూలు బస్సు ప్రమాద దుర్ఘటన మిస్టరీ వీడింది. బస్సు ప్రమాదంపై పోలీసుల దర్యాప్తులో కీలక విషయాలు వెల్లడయ్యాయి. వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో మంటలు చెలరేగి 19 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనం నడిపిన శివశంకర్ అనే యువకుడు కూడా మృతి చెందాడు. అయితే, బైక్‌పై శివశంకర్ వెనుక కూర్చున్న వ్యక్తిని ఎర్రిస్వామిగా పోలీసులు గుర్తించారు. అతన్ని పలు తరువాయి 2 వ పేజీలో...

## బస్వరాజ్ నిర్ణయమే

### మా లొంగుబాటు ద్రోహం కాదు

### పౌరహక్కుల నేతల విమర్శలు సరికాదు.. విప్లవ స్ఫూర్తి ఉంది, ప్రజల మధ్యే పనిచేస్తాం

### మావోయిస్టు మాజీ నేత ఆశన్న.. మావోయిస్టు పార్టీ ఆరోపణలపై వివరణ

హైదరాబాద్, అక్టోబర్ 25 (ఈవార్తలు): తమ లొంగుబాటుపై మావోయిస్టు పార్టీ చేస్తున్న ఆరోపణలపై మాజీ మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు ఆశన్న (రూపేశ్) సంచలన వ్యాఖ్యలు చేశారు. తాము కోవర్టులుగా పనిచేసి పార్టీకి ద్రోహం చేశామన్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. సాయుధ పోరాటాన్ని విరమించాలనే నిర్ణయం మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబళ్ల కేశవరావు (బస్వరాజ్) బతికుండగానే ఆయన నాయకత్వంలో తీసుకున్నదేనని స్పష్టం చేశారు. ఈ మేరకు లొంగిపోయిన ఇతర మావోయిస్టులతో కలిసి ఆయన ఓ వీడియోను విడుదల చేశారు. "మావోయిస్టు పార్టీ నుంచి ఎవరు బయటకు వచ్చినా ద్రోహులు తరువాయి 2 వ పేజీలో...





## ఐదు రోజులు వర్షాలు

### మెరుపులతో 30-40 కి.మీ వేగంతో గాలులు

### 27 నుంచి పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం

### అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

2

## ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ పరీక్షలు

### ఫస్టియర్ నుంచే ప్రాక్టికల్స్.. ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, అక్టోబర్ 25 (ఈవార్తలు): తెలంగాణలో ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం ఒక కీలక అప్‌డేట్ వెలువడింది. రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు 2025 సంవత్సరానికి సంబంధించిన ఇంటర్ పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ పరీక్షలు వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు జరగనున్నాయి. అంతేకాకుండా, ఈసారి విద్యార్థుల కోసం సిలబస్‌లోనూ పెద్ద మార్పులు చోటుచేసుకున్నాయి. ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ ఏడాది నుంచి మొదటి సంవత్సర విద్యార్థులకూ ల్యాబ్, ప్రాక్టికల్ పరీక్షలు ఉండనున్నాయి. ఇప్పటి వరకు ప్రాక్టికల్ తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు

26.10.2025

మేషం: దూరప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. ముఖ్యమైన  పనులు అనుకూలిస్తాయి. వ్యాపార, ఉద్యోగాలలో వివాదాలు పరిష్కారమౌతాయి. నిరుద్యోగులకు నూతన అవకాశములు అందుతాయి. ఇంటాబయట పరిస్థితులు అనుకూలిస్తాయి. పుణ్య క్షేత్రాలు సందర్శిస్తారు.

వృషభం: కుటుంబ పెద్దలతో ఆరోగ్య విషయంలో శుభవార్తలు అందుతాయి. కొన్ని వ్యవహారాలలో మిత్రుల నుంచి ధన సహాయం అందుతుంది. సోదరులతో స్థిరాస్తి వివాదాలు పరిష్కారమౌతాయి. వ్యాపార, ఉద్యోగాలలో అధికారుల అనుగ్రహం కలుగుతుంది. కుటుంబ సభ్యుల సహాయ సహకారాలతో కొన్ని పనులు పూర్తి చేస్తారు.

మిధునం: వాహన అనుకూలత కలుగుతుంది. ప్రముఖుల నుంచి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి. వ్యాపార, ఉద్యోగాలలో అంచనాలు నిజమవుతాయి. నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశములు అందుతాయి. సంఘంలో పెద్దలతో పరిచయాలు పెరుగుతాయి.

కర్కాటకం: నిరుద్యోగ ప్రయత్నాలు సఫలం అవుతాయి. ఆకస్మిక ధన లాభ సూచనలున్నవి. ప్రముఖుల నుంచి కీలక సమాచారం అందుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో మరింత పురోగతి సాధిస్తారు. స్థిరాస్తి కొనుగోలు చేస్తారు. చేపట్టిన పనులు విజయవంతంగా సాగుతాయి.

సింహం: ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. సన్నిహితులు, మిత్రుల నుంచి ఒత్తిడులు పెరుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలు నిరుత్సాహపరుస్తాయి. ఋణ ఒత్తిడి పెరుగుతుంది. కుటుంబ సభ్యులతో ఆలయాలు సందర్శిస్తారు. ముఖ్యమైన పనులు వాయిదా పడుతాయి.

కన్య: ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉంటుంది. బంధువులతో స్వల్ప విభేదాలు తప్పవు. సహనంతో కానీ కొన్ని పనులు పూర్తి కావు. వ్యాపారాలు, ఉద్యోగాలలో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ప్రయాణాలలో వాహన ప్రమాద సూచనలు ఉన్నవి. ఆదాయానికి మించి ఖర్చులుంటాయి.

తుల: ముఖ్యమైన పనులలో  విజయం సాధిస్తారు. గృహమునకు చిన్ననాటి మిత్రులు ఆగమనం ఆనందం కలిగిస్తుంది. వ్యాపారాలు విస్తరిస్తారు. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా సాగుతాయి. చేపట్టిన పనులలో శ్రమకు తగిన ఫలితం కనిపిస్తుంది.

వృశ్చికం: ఆర్థిక పరంగా ఒత్తిడులు తప్పవు. కొన్ని వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. కుటుంబ విషయాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. వ్యాపార, ఉద్యోగాలలో నిరుత్సాహం తప్పదు. నిరుద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి. బంధు మిత్రులతో అకారణంగా వివాదాలు కలుగుతాయి.

ధనస్సు: వ్యాపారమున కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు. కుటుంబ సభ్యుల ప్రవర్తన ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆకస్మిక ధన, వస్తు లాభాలు పొందుతారు. ఉద్యోగాలలో అనుకూల మార్పులు ఉంటాయి. చిన్ననాటి మిత్రులను కలుసుకుని పాత విషయాలు చర్చిస్తారు. స్థిరాస్తి వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి.

మకరం: చేపట్టిన పనులలో స్వల్ప అవాంతరాలు ఉంటాయి. సన్నిహితుల నుంచి ఊహించని సమస్యలు ఎదురవుతాయి. ఆలయాలు సందర్శిస్తారు. వ్యాపార, ఉద్యోగాలలో సమస్యలు తప్పవు. ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. ప్రయాణాలలో ఆకస్మిక మార్పులు చేస్తారు.

కుంభం: దీర్ఘకాలిక రుణాలు నుండి బయట పడగలుగుతారు. చేపట్టిన వ్యవహారాలు ఆశాజనకంగా సాగుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. వ్యాపార ఉద్యోగాలు మరింత అనుకూలంగా సాగుతాయి. సన్నిహితులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. విందువినోద కార్యక్రమాలలో ఆహ్వానాలు అందుతాయి.

మీనం: విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. నిరుద్యోగులకు అప్రయత్నంగా అవకాశాలు లభిస్తాయి. ఉద్యోగ వాతావరణం అనుకూలంగా ఉంటుంది. సన్నిహితుల సహాయ సహకారాలతో నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. పనులు సకాలంలో పూర్తి చేస్తారు.



# త్వరలో ఫోల్డబుల్ ఐఫోన్

మొదటి పేజీ తరువాయి

తాజా నివేదికలో పేర్కొంది. యాపిల్ రాకతో ఫోల్డబుల్ ఫోన్లు ఒక ప్రత్యేక సెగ్మెంట్ నుంచి మెయిన్‌స్ట్రీమ్‌గా మారే అవకాశం ఉందని విశ్లేషించింది. కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ నివేదిక ప్రకారం, యాపిల్ వంటి పెద్ద బ్రాండ్ ఫోల్డబుల్ రంగంలోకి ప్రవేశిస్తే, ఈ ఫోన్లపై వినియోగదారుల్లో అవగాహన ఒక్కసారిగా పెరుగుతుంది. ముఖ్యంగా హై-ఎండ్ సెగ్మెంట్‌లో స్మార్ట్‌ఫోన్లను మార్చే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుందని అంచనా వేసింది. యాపిల్ తనకున్న ఎకోసిస్టమ్ బలంతో మార్కెట్ డైనమిక్స్‌ను సమూలంగా మార్చే శక్తి ఉందని, ఇది మొత్తం అమ్మకాలను పెంచుతుందని తెలిపింది. గత కొన్నేళ్ల ప్రయోగాల తర్వాత, ప్రస్తుతం ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్ మార్కెట్ స్థిరమైన వృద్ధి దశలోకి ప్రవేశించింది. ముఖ్యంగా అమెరికా మార్కెట్‌లో 2025లో ఈ విభాగం 68 శాతం వృద్ధిని నమోదు చేస్తుందని నివేదిక అంచనా వేసింది. మెరుగైన డిజైన్లు, ఫోన్ల మన్నిక పెరగడం, పలు బ్రాండ్లు విభిన్నమైన మోడళ్లను తీసుకురావడం ఈ వృద్ధికి కారణమవుతున్నాయి. ప్రస్తుతం ఈ మార్కెట్‌లో శాంసంగ్ తన గెలాక్సీ ఫోల్డ్, ఫ్లిప్ సిరీస్‌లతో ఆధిపత్యం చెలాయిస్తోంది. ఈ ఏడాది చివరిలోగా మూడుసార్లు మడిచే (ట్రై-ఫోల్డ్) డివైజ్‌ను కూడా ఆవిష్కరించేందుకు సిద్ధమవుతోంది. మరోవైపు మోటరోలా తన రేజర్ సిరీస్‌తో వేగంగా మార్కెట్ వాటాను పెంచుకుంటూ శాంసంగ్‌కు గట్టిపోటీనిస్తోంది. 2025 అక్టోబర్ లో విడుదలైన గూగుల్ పిక్సెల్ 10 ప్రో ఫోల్డ్, తనదైన ఏఐ ఫీచర్లతో శాంసంగ్, మోటరోలాకు మధ్య తన స్థానాన్ని పదిలపరుచుకునే ప్రయత్నం చేస్తోంది. ఈ అంశంపై కౌంటర్ పాయింట్ రీసెర్చ్ అసోసియేట్ డైరెక్టర్ లిజ్ లీ మాట్లాడుతూ.. "2025లో శాంసంగ్ తన అనుభవంతో, ఎకోసిస్టమ్ బలంతో మార్కెట్‌లో ముందుంది. అయితే, మోటరోలా వేగంగా విస్తరించడం, గూగుల్ ఏఐ ఆధారిత ఫీచర్లతో పోటీని తీవ్రతరం చేస్తున్నాయి. 2026లో యాపిల్ అడుగుపెడితే, ఈ మార్కెట్ మరింత విస్తరించడమే కాకుండా, ఫోల్డబుల్స్ ఒక ప్రధాన ప్రీమియం స్మార్ట్‌ఫోన్ ఫార్మాట్‌గా స్థిరపడతాయి" అని వివరించారు.



# కండ్లు చెప్పే రోగం!

మొదటి పేజీ తరువాయి

బృందం 74,000 మందికి పైగా వ్యక్తుల రెటీనా స్కాన్‌లు, జన్యుపరమైన డేటా, రక్త నమూనాలను విశ్లేషించింది. రెటీనాలో తక్కువ శాఖలతో సరళంగా ఉండే రక్తనాళాలు కలిగిన వ్యక్తులలో గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం ఎక్కువగా ఉన్నట్లు, వారిలో వృద్ధాప్య ఛాయలు కూడా వేగంగా కనిపిస్తున్నట్లు గుర్తించారు. ప్రస్తుతం గుండె జబ్బులు, స్ట్రోక్, డిమెన్షియా వంటి వయసు సంబంధిత వ్యాధులను నిర్ధారించడానికి అనేక రకాల పరీక్షలు అవసరమవుతున్నాయి. భవిష్యత్తులో కేవలం ఒక రెటీనా స్కాన్‌తోనే ఈ ముప్పును సులభంగా, వేగంగా అంచనా వేయవచ్చని పరిశోధకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఈ విధానం పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడానికి మరింత పరిశోధన అవసరమని వారు స్పష్టం చేశారు. ఈ పరిశోధనలో భాగంగా రక్తంలోని బయోమార్కర్లను విశ్లేషించి, కంటి రక్తనాళాల్లో మార్పులకు కారణమవుతున్న రెండు కీలక ప్రొటీన్లను కూడా గుర్తించారు. ఎంఎంపీ12, ఐజీజీ-ఎఫ్‌సీ రిసెప్టార్ ఎల్ఎల్‌బీ అనే ఈ ప్రొటీన్లు వాపు, రక్తనాళాల వృద్ధాప్యానికి కారణమవుతాయని తేల్చారు. "మా ఆవిష్కరణలు రక్తనాళాల వృద్ధాప్యాన్ని నెమ్మదింపజేయడానికి, గుండె జబ్బుల భారాన్ని తగ్గించడానికి, చివరికి ఆయుష్షును మెరుగుపరచడానికి కొత్త మందుల తయారీకి మార్గం చూపుతున్నాయి" అని మేరీ పిగెర్ తెలిపారు.

# పరాయి మోజు!

మొదటి పేజీ తరువాయి

ఇస్తారు. కానీ ప్రస్తుత యువతరం ఆధునికతకు అలవాటు పడుతున్న కొద్దీ సంబంధాలకు విలువ ఇవ్వడం లేదు. అందుకే ఇటీవలి రోజుల్లో అక్రమ సంబంధాలు, వైవాహిక జీవితంలో చీలికలు, సాన్నిహిత్యం లేకపోవడం లాంటివి పెరుగుతున్నట్లు అధ్యయనాలు పేర్కొంటున్నాయి.. ఫ్రెంచ్ డేటింగ్ ప్లాట్‌ఫాం 'గ్లీడెన్' తాజా అధ్యయనంలోనూ పలు షాకింగ్ విషయాలు వెల్లడయ్యాయి. గ్లీడెన్ వివాహేతర అక్రమ సంబంధాల కేసులు అత్యధికంగా ఉన్న నగరాల జాబితాను ప్రచురించింది. భారతదేశంలో అత్యధిక సంఖ్యలో అక్రమ సంబంధాలు ఉన్న నగరంగా బెంగళూరు నిలించింది. ఈ మేరకు గ్లీడాన్ సంచలన వాస్తవాన్ని నివేదికలో పంచుకుంది. భారతదేశంలో గ్లీడెన్ యాప్ ద్వారా నమోదు అయిన వినియోగదారులలో 20 శాతం మంది బెంగళూరుకు చెందిన వారే ఉన్నారని పేర్కొంది.. అలాగే బెంగళూరు తరువాతి స్థానాల్లో ముంబై 19 శాతం, కోల్‌కతా 18 శాతం, ఢిల్లీ 15 శాతం, పూణె 10 శాతం ఉన్నట్లు సంస్థ పేర్కొంది. దేశవ్యాప్తంగా మూడు మిలియన్లకు పైగా వ్యక్తులు ఈ ప్లాట్‌ఫాంలో యాక్టివ్‌గా ఉన్నట్లు పేర్కొంది. ఇతర రంగాల కన్న ఐటీ, వైద్య రంగాల్లో వివాహేతర సంబంధాలు ఎక్కువ పెట్టుకుంటున్నారని గ్లీడెన్ సంస్థ తెలిపింది. టైర్-1 నగరాలతో పాటు టైర్-2 నగరాల్లో కూడా ఈ ధోరణి పెరుగుతుందని గ్లీడెన్ నివేదిక పేర్కొంది.. అయితే ఈ వివాహేతర సంబంధాల్లో హైదరాబాద్ నగరం అధికారికంగా టాప్ 5 లో లేకపోవడం గమనార్హం.విడాకుల కేసులను నిర్వహించే న్యాయవాదులు, సంబంధిత నిపుణులు.. వివాహేతర సంబంధాలపై పలు ఆసక్తికర విషయాలను పంచుకుంటున్నారు.. ముఖ్యంగా అవిశ్వాసం, వివాహేతర సంబంధాలు పెరగడానికి భావోద్వేగ అసంతృప్తి, వ్యక్తిగత అవస రాలు తీర్చకపోవడం, శారీరక, మానసిక సాన్నిహిత్యం లేకపోవడం, వివాహేతర యాప్‌ల వాడకమే కారణం అని అంటున్నారు. గ్లీడాన్ ఇండియా మేనేజర్ సిబిల్ షిడెల్ మాట్లాడుతూ.. భారతదేశంలో 3 మిలియన్ల మంది గ్లీడాన్ అనే డేటింగ్ యాప్‌ను ఉపయోగిస్తున్నారని చెప్పారు. ఇందులో 17% మంది బెంగళూరుకు చెందినవారున్నారు. వీరిలో ఎక్కువ మంది 30 నుండి 45 సంవత్సరాల వయస్సు గల వారున్నారని పేర్కొన్నారు. ఈ యాప్‌ను ఉపయోగించే వారిలో 65% మంది పురుషులు. 35% మంది మహిళలున్నారు. అయితే యాప్‌ను ఉపయోగించే వారిలో ఎక్కువ మంది ఇంజనీరింగ్, వ్యవస్థాపకత వంటి నేపథ్యాలకు చెందిన వారున్నారు. శారీరక సంబంధం కంటే భావోద్వేగ మద్దతు కోసం ఈ యాప్ వాడకం పెరుగుతోందని అధ్యయనం తెలిపింది.

## ఐదు రోజులు వర్షాలు

హైదరాబాద్, అక్టోబర్ 25 (ఈవార్తలు): రాష్ట్రంలో రాబోయే ఐదు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడతాయని, కొన్ని చోట్ల భారీ వర్షాలు నమోదయ్యే సూచనలున్నాయని తెలిపింది. ఈ మేరకు శనివారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేసింది. అక్టోబర్ 26న ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి సహా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడనున్నాయి. అక్టోబర్ 27 నుంచి వర్షాల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయి. అక్టోబర్ 28, 29 తేదీల్లో పెద్దపల్లి, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్‌తో పాటు పలు ఉమ్మడి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈదురు గాలులతో కూడిన వర్షాలు రాష్ట్రవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో నమోదవుతాయని పేర్కొంది. అక్టోబర్ 30 తర్వాత వర్షాల తీవ్రత క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని తెలిపింది. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని  సూచించింది.

## అమరులకు సారీ!

మొదటి పేజీ తరువాయి

న్యాయం చేయలేకపోయామన్నారు. 'కేవలం 500 మంది అమరవీరుల కుటుంబాలకు మాత్రమే ఉద్యోగాలు ఇచ్చాం. ఉద్యమకారులకు ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ సీట్లు, కొన్ని చోట్ల ఎంపీపీ, జడ్పీటీసీ టిక్కెట్లు దక్కినప్పటికీ.. వారికి దక్కాల్సిన న్యాయం జరగలేదు. అని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. తాను మంత్రిగా లేకపోయినా, ఎంపీగా అమరవీరుల కుటుంబాలకు న్యాయం జరగాలని పార్టీ అంతర్గత వేదికల్లో పదే పదే అడిగినట్లు చెప్పారు. అయినప్పటికీ, ఉద్యమకారులకు న్యాయం జరిగే వరకు కొట్లాడలేకపోయినందుకు నేను బహిరంగ క్షమాపణ చెబుతున్నానని కవిత ప్రకటించారు. అమరవీరుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కోటి రూపాయల పరిహారం ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ డిమాండ్‌ను నెరవేర్చకపోతే, వచ్చే ప్రభుత్వంతో తప్పక ఇప్పిస్తామని హామీ ఇచ్చారు ప్రస్తుత ప్రభుత్వం తెలంగాణ తల్లి చేతిలోని బతుకమ్మను తీసివేసిందని మండిపడ్డారు. తెలంగాణ తల్లి చేతిలో తిరిగి బతుకమ్మ ఉండే వరకు పోరాటం చేస్తామని, ఈ ప్రభుత్వంపై "జంగ్ సైరన్" మోగిద్దామని ఆమె పిలుపునిచ్చారు. సామాజిక తెలంగాణ సాధనే లక్ష్యంగా తాను ఈ పర్యటనకు బయలుదేరుతున్నానని కవిత స్పష్టం చేశారు. అందరి కోసం సామాజిక తెలంగాణ రావాలనేదే లక్ష్యమన్నారు. ప్రతి ఒక్కరికీ అన్ని రంగాల్లో సమాన అవకాశాలు రావాలని.. అగ్రవర్ణాల్లోనూ అన్ని కులాలకు రాజకీయ ప్రాతినిధ్యం లేదన్నారు. అన్ని వర్గాలు కలిసి ఉంటేనే తెలంగాణ బాగుంటుది కవిత స్పష్టం చేశారు. గతంలో జాగృతిలో పనిచేసిన వారంతా మనస్పర్థలను పక్కనపెట్టి మళ్లీ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆత్మగౌరవంతో కూడిన తెలంగాణ సాధన కోసం, జిల్లాల్లో ఎక్కడ అభివృద్ధి ఆగిపోయిందో అక్కడికి వెళ్లి పోరాటం చేస్తామని కవిత స్పష్టం చేశారు.

### నా దారి నేను వెతుక్కుంటున్నా : కవిత

'20 ఏళ్లుగా కేసీఆర్, టీఆర్ఎస్, బీఆర్ఎస్ కోసం పనిచేశా.. ఇంటి గుట్టు బయట పెట్టి.. కుట్ర చేసి నన్ను బయటకు పంపించారు.. ఇప్పుడు నా దారి నేను వెతుక్కుంటున్నా.. ఈ జిల్లా బిడ్డగా, కోడలిగా మీ ఆశీర్వాదం కోసం వచ్చా' అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హాట్ కామెంట్స్ చేశారు. శనివారం నిజామాబాద్ తెలంగాణ జాగృతి కార్యాలయంలో "జాగృతి జనం బాట" ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడారు. నిజామాబాద్‌లో నా ఓటమి ఓ కుట్రనా? కాదా? అని ప్రశ్నించారు. నిజామాబాద్ బీఆర్ఎస్ కార్యకర్తలు ఆలోచించాలని ఆమె సూచించారు. గత 5 నెలలుగా జరుగుతున్న రాజకీయ పరిణామాల కారణంగా నిజామాబాద్ రాలేకపోయానని, ఇన్ని రోజుల తర్వాత ఇక్కడికి రావటం సంతోషంగా ఉందన్నారు. నేను నిజామాబాద్ కోడలిని, ఇది నా గడ్డ, ఎప్పటికైనా ఈ గడ్డలోనే కలిసిపోతానని అన్నారు. దేశవ్యాప్తంగా ఎక్కడ ఉన్న సరే నా మనసు ఈ గడ్డపైకి కొట్టుకుంటుందని చెప్పారు. ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు హెడ్గేవార్ ఈ జిల్లాలోని కందకూరులో పుట్టారని గుర్తుచేశారు. మీ బిడ్డను కాబట్టి నన్ను ఇక్కడి నుంచి పార్లమెంట్‌కు పంపించారని, మీ మర్యాద, గౌరవం కాపాడే విధంగా పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నానని చెప్పుకొచ్చారు. 'నేను 27 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు ఉద్యమంలోకి వచ్చా, గత 20 ఏళ్లుగా తెలంగాణ కోసం, కేసీఆర్ కోసం, టీఆర్ఎస్, బీఆర్ఎస్ కోసం పనిచేశా, మీ కోడలిగా, బిడ్డగా నాకు ఎన్ని కష్టాలు ఎదురైనా సరే సహనంతో ఎదురు చూశాను, నేను బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా ఏమీ చేయలే, కానీ నన్ను కుట్ర చేసిన పంపించారు, నిజామాబాద్‌లో ఉన్న బీఆర్ఎస్ కార్యకర్తలు ఆలోచించాలని కోరుతున్నా.

## ఆధార్ లింక్ చేయకపోతే

# జీతాలు బంద్

మొదటి పేజీ తరువాయి

లేకపోవడం, కొన్నిచోట్ల అక్రమాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు రావడమే కారణంగా తెలుస్తోంది. కొన్ని కార్యాలయాల్లో ఉద్యోగం మానేసినా లేదా అనధికారికంగా దీర్ఘకాలిక సెలవుల్లో ఉన్నా వారి పేర్ల మీద జీతాలు డ్రా చేస్తున్నట్లు ప్రభుత్వ దృష్టికి వచ్చింది. ఆధార్, పేరు, మొబైల్ నంబర్ వంటి వివరాలను అనుసంధానించడం ద్వారా అసలైన ఉద్యోగుల సంఖ్యను తేల్చవచ్చని, తద్వారా అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చని అధికారులు భావిస్తున్నారు. పలుమార్లు సూచించినా కార్యాలయాలు స్పందించకపోవడంతో ఆర్థిక శాఖ ఈసారి గడువు విధించి హెచ్చరికలు జారీ చేసింది.

## బైక్ స్కిడ్ అవడం వల్లే..!

మొదటి పేజీ తరువాయి

కోణాల్లో ప్రశ్నించి కీలక ఆధారాలు సేకరించారు. కేసు వివరాలను కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మీడియాకు వెల్లడించారు. "శుక్రవారం జరిగిన బస్సు ప్రమాద ఘటన దర్యాప్తులో భాగంగా బైక్ నడుపుతూ చనిపోయిన శివశంకర్‌తో పాటు వెనుకాల కూర్చున్న వ్యక్తి ఎర్రిస్వామి అలియాస్ నానిగా గుర్తించాం. అతన్ని పలు కోణాల్లో విచారించాం. ఎర్రిస్వామి, పల్సర్ బైక్ నడుపుతున్న శివశంకర్ ఇద్దరూ కలిసి లక్ష్మీపురం గ్రామం నుంచి అర్ధరాత్రి దాటిన తర్వాత (సుమారు 2గంటలకు) తుగ్గలికి బయల్దేరారు. మార్గ మధ్యలో అర్ధరాత్రి 2.24 గంటలకు కియాషోరూమ్ సమీపంలోని ఉన్న పెట్రోల్ బంక్ వద్ద రూ.300 పెట్రోల్ పోయించుకున్నారు. అక్కడి నుంచి బయల్దేరిన కొద్ది సేపటికే చిన్నటేకూరు సమీపంలో శివశంకర్ బైక్ నడుపుతూ స్కిడ్ అయి.. రోడ్డుకు కుడివైపు ఉన్న డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శివశంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై వెనుక ఉన్న ఎర్రిస్వామి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. రోడ్డు మధ్యలో పడి ఉన్న శివశంకర్‌ను పక్కకు తీసి,  బైక్‌ను తీద్దామనుకునే సరికి అంతలోనే వేగంగా వచ్చిన బస్సు బైక్‌ను ఢీకొని కొద్ది దూరం ఈడ్చు కెళ్లింది. బస్సు కింద మంటలు రావడంతో ఎర్రిస్వామి భయపడి అక్కడి నుంచి తన స్వగ్రామం తుగ్గలి వెళ్లి పోయాడు. బస్సు ప్రమాద ఘటనపై ఉలిందకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో తదుపరి విచారణ కొనగిస్తున్నాం" అని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు.

## ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ పరీక్షలు

మొదటి పేజీ తరువాయి

పరీక్షలు కేవలం రెండో సంవత్సర విద్యార్థులకే ఉండేవి. అయితే, విద్యార్థులు మొదటి సంవత్సరం నుంచే ప్రయోగశాలల్లో అనుభవం పెంపొందించుకోవడం, ప్రాక్టికల్ జ్ఞానం పెరగడం లక్ష్యంగా ఈ కొత్త విధానం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఇది విద్యార్థులకు ప్రాక్టికల్ నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో కీలకంగా మారుతుందని బోర్డు భావిస్తోంది. "సాధారణంగా విద్యార్థులు సిద్ధాంతపరమైన పాఠ్యాంశాలపైనే దృష్టి పెట్టేవారు. కానీ ల్యాబ్ సెషన్లు మొదటి నుంచే ఉంటే, వారు విషయాన్ని లోతుగా అర్థం చేసుకుని, ప్రాక్టికల్ స్థాయిలో నేర్చుకుంటారు" అని అధికారులు వివరించారు. ఇక సిలబస్ మార్పుల విషయానికి వస్తే, రెండు సంవత్సరాల తర్వాత తెలంగాణ ఇంటర్ బోర్డు ఎన్‌సీఈఆర్టీ మార్గదర్శకాల ఆధారంగా సబ్జెక్టు కమిటీ సూచనలతో కొత్త మార్పులు చేపడుతోంది.

# బస్వరాజ్ నిర్ణయమే

మొదటి పేజీ తరువాయి

అనడం పరిపాటి. అందుకే మొదట స్పందించవద్దని అనుకున్నాం. కానీ, పార్టీకి జరిగిన నష్టానికి మేమే కారణమని, కోవర్టులుగా పనిచేశామని ఆరోపించడంతో సమాధానం చెప్పాలని ఈ వీడియో చేస్తున్నాం" అని ఆశన్న తెలిపారు. అడవి మార్గాన్ని వీడే క్రమంలో సాయుధ పోరాట విరమణ, శాంతి చర్చలు అనే రెండు అంశాలపై చర్చ జరిగిందని, చివరికి సాయుధ పోరాట విరమణకే మొగ్గు చూపినట్లు వివరించారు. ఈ చర్చలన్నీ ఏప్రిల్-మే నెలల్లో బస్వరాజ్ నాయకత్వంలోనే జరిగాయని, ఇప్పుడు ఆయన చనిపోయారు కాబట్టి తిరిగి వచ్చి చెప్పలేరనే ధైర్యంతో కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆశన్న విమర్శించారు. సాయుధ పోరాట విరమణ విషయంలో బస్వరాజ్ రాసిన చివరి లేఖను పార్టీలోని కొందరు కీలక నేతలు దాచిపెట్టారని ఆశన్న సంచలన ఆరోపణలు చేశారు.

"మే 18న బస్వరాజ్ తన చివరి లేఖ పంపిన తర్వాతే ఎన్‌కౌంటర్‌లో మరణించారు. ఆ తర్వాత నేను కొందరు కేంద్ర కమిటీ సభ్యులను కలిసి ఆ లేఖను చూపించాను. మనం ఎలాంటి తప్పు నిర్ణయం తీసుకోలేదని, పార్టీని కాపాడుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని బస్వరాజ్ ఆ లేఖలో స్పష్టంగా రాశారు. అయితే మే 13న ఆయన కేంద్ర కమిటీ సభ్యులందరికీ రాసిన లేఖను మాత్రం ఒకరిద్దరు చదివి, మిగతావారికి ఇవ్వకుండా దాచిపెట్టారు. ఆ లేఖ బయటకు వస్తే వాస్తవాలు తెలుస్తాయనే భయంతోనే ఇలా చేస్తున్నారు" అని ఆశన్న ఆరోపించారు.

ఈ విషయంలో పౌరహక్కుల సంఘాల నేతలు, ప్రజాస్వామ్యవాదులు తమ పరిధి దాటి మాట్లాడుతున్నారని ఆశన్న మండిపడ్డారు. "హైదరాబాద్‌లో కూర్చుని ఆయుధాలే ముఖ్యమంటున్నారు. మా శవాలు వస్తే ఎర్రజెండాలు పట్టుకుని ఊరేగింపులు చేద్దామనుకుంటున్నారా? దారులన్నీ మూసుకుపోయినప్పుడు ఏ లక్ష్యం కోసం ప్రాణత్యాగం చేయాలి?" అని ఆయన ప్రశ్నించారు. పౌరహక్కుల సంఘాల నేతలు రెండు వైపులా వాదనలు వినకుండా ఏకపక్షంగా ఎలా నిర్ధారణకు వస్తారని నిలదీశారు. తాము అందుబాటులోనే ఉన్నామని, వాస్తవాలు తెలుసుకోవాలంటే తమను సంప్రదించవచ్చని సూచించారు. తమలో ఇంకా విప్లవతత్వం ఉందని, ఎలాంటి స్వార్థ ప్రయోజనాల కోసం తాము లొంగిపోలేదని ఆశన్న స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని, ప్రజల మధ్య ఉండి ప్రజా పోరాటాల్లో పాల్గొంటామని తెలిపారు. త్వరలోనే అందరి సలహాలు తీసుకుని తమ భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని పేర్కొన్నారు.

# నువ్వా నేనా.. సై!

## అంబేద్కర్ విగ్రహం దగ్గర తేల్చుకుందాం.. హరీశ్‌రావుకు మంత్రి అడ్లూరి సవాల్

**కేబినెట్‌ను దండుపాళ్యం బ్యాచ్ అనడంపై ఫైర్**

**హరీశ్ రావుకు బహిరంగ చర్చకు సవాల్ విసిరిన మంత్రి**



హైదరాబాద్, అక్టోబర్ 25 (ఈవార్తలు): రాష్ట్ర కేబినెట్ సమావేశంపై మాజీ మంత్రి హరీశ్ రావు చేసిన 'దండుపాళ్యం బ్యాచ్' వ్యాఖ్యలపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన, రెండేళ్ల కాంగ్రెస్ పాలనపై బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ హరీశ్ రావుకు ఆయన సవాల్ విసిరారు. హైదరాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్దకు తాము వస్తామని, చర్చకు మీరు వస్తారా? అని సూటిగా ప్రశ్నించారు. సిద్దిపేటలో ఈరోజు మీడియాతో మాట్లాడిన అడ్లూరి లక్ష్మణ్.. హరీశ్ రావు వ్యాఖ్యలు చాలా బాధ కలిగించాయన్నారు. 'ఒక ఉద్యమ నాయకుడు అయి ఉండి కేబినెట్‌ను అలా సంబోధించడం సిగ్గుచేటు. 2004లో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలో హరీశ్ రావు మంత్రిగా పనిచేశారు, ఆ విషయం ఆయన మరవొద్దు. మా కేబినెట్ మీటింగ్ ప్రజల అవసరాల కోసమే... అంతే తప్ప, దండుపాళ్యంలా దోచుకోవడానికి కాదు' అని ఆయన స్పష్టం చేశారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నేతలు ఇలా మాట్లాడటం దారుణమన్నారు. ఒక మాజీ ఎమ్మెల్యేతో, తన భజన మండలితో తనను తిట్టించడం ఎంతవరకు సమంజసమని హరీశ్‌ను ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 20 నెలలు కూడా కాకముందే ఇంతగా టార్గెట్ చేయడం సరికాదన్నారు. దళిత ముఖ్యమంత్రి, ఇంటికో ఉద్యోగం లాంటి హామీలను బీఆర్ఎస్ నెరవేర్చిందా? అని నిలదీశారు. పదేళ్లలో ఒక్కరికైనా నియామక పత్రం ఇచ్చారా? అని అడిగారు. "ముఖ్యమంత్రిని, మంత్రులను ఏకవచనంతో మాట్లాడటం సరికాదు. బీఆర్ఎస్ చేసిన అప్పులకు వడ్డీలు కట్టుకుంటూనే మేము సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ప్రజలే మాకు బుద్ధి చెబుతారు" అని అన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్‌ను కేంద్రం ఎందుకు అమలు చేయడం లేదో రాష్ట్రంలోని ఇద్దరు కేంద్ర మంత్రులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తనకు ఆస్తులు, ఫామ్ హౌస్‌ల కన్నా దళితుల ఆత్మగౌరవమే ముఖ్యమని, త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్, గ్రామస్థాయి ఎన్నికల్లో ప్రజలు ఎవరికి మద్దతిస్తారో చూద్దామని అడ్లూరి లక్ష్మణ్ పేర్కొన్నారు.

## కొడుకు పుట్టలేదని.. 9 నెలల కూతురు సహా తల్లి ఆత్మహత్య

**మంచిర్యాల జిల్లాలో తీవ్ర విషాదం**

మంచిర్యాల, అక్టోబర్ 25 (ఈవార్తలు): మంచిర్యాల జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. కొడుకు పుట్టలేదన్న మనస్తాపంతో ఓ తల్లి తన 9 నెలల పసికందుతో కలిసి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ హృదయ విదారక ఘటన జన్నారం మండలం రేండ్లగూడలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. రేండ్లగూడకు చెందిన శ్రవణ్‌తో స్పందనకు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. ఈ దంపతులకు ఇప్పటికే మూడేళ్ల కుమార్తె ఉంది. తొమ్మిది నెలల క్రితం స్పందన రెండోసారి కూడా ఆడపిల్లకు జన్మనిచ్చింది. అయితే, రెండో కాన్పులోనైనా కొడుకు పుట్టలేదనే కారణంతో ఆమె గత కొంతకాలంగా తీవ్ర మనోవేదనకు గురవుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే జీవితంపై విరక్తి చెందిన స్పందన, తన 9 నెలల చిన్నారి సహా గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలోకి దూకింది. తల్లీకూతుళ్లు బావిలో పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు, స్థానికుల సహాయంతో మృతదేహాలను వెలికితీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ముఖం చూసి మోసపోవద్దు :సజ్జనార్

హైదరాబాద్, అక్టోబర్ 25 (ఈవార్తలు): సైబర్ నేరాల పట్ల మరోసారి ప్రజలను హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ అప్రమత్తం చేశారు. ముఖం చూసి మోసపోవద్దు.. జాగ్రత్త అని సీపీ హెచ్చరించారు. వాట్సాప్‌లో డీపీగా తన ఫోటోను పెట్టుకుని తెలిసిన వాళ్లకు సందేశాలు పంపిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని సీపీ పేర్కొన్నారు. ఇవి నకిలీ ఖాతాలు. పూర్తిగా మోసపూరితమైనవి అని తెలిపారు. ఇలాంటి సందేశాలకు స్పందించకండి. ఆ నంబర్లను వెంటనే బ్లాక్ చేసి రిపోర్ట్ చేయండి అని సజ్జనార్ సూచించారు. సైబర్ నేరగాళ్లకు మీ వ్యక్తిగత వివరాలను అసలే ఇవ్వొద్దు. డబ్బులు అడిగితే పంపించొద్దు.

# సీఎం సెటిల్‌మెంట్లు

**మంత్రుల మధ్య వాటాల గొడవలు**

**తగాదాలు తీర్చడంలో సీఎం బిజీ**

**ఇందిరమ్మ రాజ్యంలో భారీ అవినీతి**

**రోడ్ల టెండర్లలో రూ.8 వేల కోట్ల స్కాం**

**మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి**



హైదరాబాద్, అక్టోబర్ 25 (ఈవార్తలు): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, కుంభకోణాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. 'ఇందిరమ్మ రాజ్యం'లో రోజుకో అవినీతి, పూటకో కుంభకోణం బయటపడుతోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం ఆయన ఇతర నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హ్యామ్) పద్ధతిలో చేపడుతున్న రోడ్ల టెండర్లలో దాదాపు రూ.8 వేల కోట్ల భారీ కుంభకోణం జరుగుతోందని ఆయన ఆరోపించారు. మంత్రుల మధ్య వాటాల కోసం గొడవలు జరుగుతున్నాయని, ఒక టెండర్ విషయంలో ఇద్దరు మంత్రులకు ముఖ్యమంత్రే స్వయంగా వాటాలు పంచి సెటిల్‌మెంట్ చేశారని ప్రశాంత్ రెడ్డి ధ్వజమెత్తారు. డెక్కన్ సిమెంట్స్ కంపెనీని బెదిరించిన ఘటనలోనూ, మద్యం సీసాల హెూలోగ్రాం కుంభకోణంలోనూ ముఖ్యమంత్రి పాత్ర ఉందని ఆరోపించారు. అవినీతి, ముడుపుల విషయంలో మంత్రులు రోజూ గొడవ పడుతున్నారని, దీంతో ఇందిరమ్మ రాజ్యం కుంభకోణాల నిలయంగా మారిందని విమర్శించారు. హ్యామ్ టెండర్ల గురించి వివరిస్తూ.. "కేవలం రూ.9 వేల కోట్లతో పూర్తయ్యే పనులకు రూ.17 వేల కోట్లకు టెండర్లు పిలిచారు. ఇందులో రూ.8 వేల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారు. సీఆర్ఎఫ్ నిధుల కింద కిలోమీటర్‌కు రూ.1.75 కోట్లు ఖర్చవుతుంటే, హ్యామ్ కింద కిలోమీటర్‌కు రూ.3.30 కోట్లు ఎలా ఖర్చవుతుంది? పది రోజుల తేడాలో ఇచ్చిన రెండు జీవోలలో ఇంత తేడా ఎందుకుంది?" అని ఆయన ప్రశ్నించారు. ఈ టెండర్లు దక్కించుకున్న వారికి 10 శాతం మొబిలైజేషన్ అడ్వాన్సులు చెల్లిస్తున్నారని, ఈ డబ్బు ఎవరి జేబుల్లోకి వెళుతుందో అందరికీ తెలుసని అన్నారు. ఈ హ్యామ్ టెండర్లను తక్షణమే రద్దు చేయాలని, ఈ భారీ కుంభకోణంపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కు చిత్తశుద్ధి ఉంటే దీనిపై సీబీఐ విచారణకు ఆదేశించాలని సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి తన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే తరచూ ఢిల్లీకి వెళుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ దోపిడీలో అధికారులు, ఇంజినీర్లు భాగస్వాములు కావొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. రూ.8 వేల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేసే ఈ టెండర్లపై ప్రతి వేదిక మీదా తమ గళం విప్పుతామని ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లోనే కేసీఆర్ మకాం

**జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై బీఆర్ఎస్ ప్రత్యేక దృష్టి**

**సిట్టింగ్ స్థానం నిలబెట్టుకునేందుకు పక్కా ప్రణాళిక**

**ప్రచార బాధ్యతలు కేటీఆర్, హరీశ్ రావుకు అప్పగింత**



జూబ్లీహిల్స్/హైదరాబాద్, అక్టోబర్ 25 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నిక సమీపిస్తుండటంతో బీఆర్ఎస్ తన వ్యూహాలకు పదును పెట్టింది. సిట్టింగ్ స్థానాన్ని ఎలాగైనా నిలబెట్టుకోవాలని పట్టుదలగా ఉన్న ఆ పార్టీ, ఈ ఎన్నికను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ నేపథ్యంలో పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగి ఎన్నికల వ్యూహరచనపై దృష్టి సారించారు. గురువారం ఎర్రవెల్లిలోని తన ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ ముఖ్య నేతలతో సమావేశమై జూబ్లీహిల్స్ ఉపఎన్నికపైనే ప్రధానంగా చర్చించారు. నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో ఇక పూర్తిగా ప్రచారంపై దృష్టి పెట్టాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. ఉపఎన్నిక పూర్తయ్యేంత వరకు ఆయన హైదరాబాద్‌లోని నందినగర్‌లో ఉన్న తన నివాసంలోనే మకాం వేసి, ఎన్నికల సరళిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నట్లు విశ్వసనీయ సమాచారం. నియోజకవర్గంలో ప్రచార బాధ్యతలను మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావులకు కేసీఆర్ అప్పగించారు. వారిద్దరి నేతృత్వంలో నియోజకవర్గవ్యాప్తంగా భారీ ఎత్తున రోడ్ షోలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సిట్టింగ్ స్థానాన్ని కోల్పోకూడదనే గట్టి పట్టుదలతో బీఆర్ఎస్ అధిష్ఠానం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది. కేసీఆర్ ప్రత్యక్ష పర్యవేక్షణతో జూబ్లీహిల్స్‌లో ఎన్నికల వాతావరణం మరింత వేడెక్కింది.

# సెల్ ఫోన్ దొంగలపై కాల్పులు

**డీసీపీపై కత్తితో దాడికి**

**యత్నించిన సెల్ ఫోన్ దొంగ**

**ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపిన డీసీపీ**

**దొంగలకు గాయాలు... ఆసుపత్రికి తరలింపు**



చాదర్‌ఘాట్/హైదరాబాద్, అక్టోబర్ 25 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలో కాల్పుల కలకలం రేగింది. శనివారం సాయంత్రం చాదర్‌ఘాట్ ప్రాంతంలో ఇద్దరు సెల్ ఫోన్ దొంగలపై సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ సాయి చైతన్య స్వయంగా కాల్పులు జరిపారు. తనపై కత్తితో దాడికి యత్నించడంతో ఆయన ఆత్మరక్షణ కోసం కాల్పులు జరపాల్సి వచ్చింది. ఈ ఘటనలో ఇద్దరు దొంగలకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే, డీసీపీ సాయి చైతన్య శనివారం సాయంత్రం నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సమావేశం ముగించుకుని తిరిగి తన కార్యాలయానికి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. చాదర్‌ఘాట్ విక్టరీ ప్లే గ్రౌండ్ సమీపంలో ఇద్దరు వ్యక్తులు ఒకరి నుంచి సెల్‌ఫోన్ లాక్కొని పారిపోవడాన్ని ఆయన గమనించారు. వెంటనే అప్రమత్తమైన డీసీపీ, తన గన్‌మెన్‌తో కలిసి వారిని పట్టుకునేందుకు వెంబడించారు. ఈ క్రమంలో దొంగల్లో ఒకరు డీసీపీపై కత్తితో దాడికి ప్రయత్నించాడు. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో డీసీపీ కిందపడిపోయారు. అనంతరం ఇద్దరు దొంగలు పారిపోయేందుకు ప్రయత్నించగా... డీసీపీ, గన్‌మెన్ రెండు రౌండ్లు కాల్పులు జరిపారు. దాంతో దొంగలు గాయపడి, పోలీసులకు పట్టుబడ్డారు. పోలీసులు ఇద్దరినీ అదుపులోకి తీసుకుని చికిత్స నిమిత్తం బంజారాహిల్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో స్థానికంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న సౌత్ ఈస్ట్ జోన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. స్వల్పంగా గాయపడిన డీసీపీ సాయి చైతన్యకు మలక్ పేట ఆసుపత్రిలో చికిత్స అందించారు. పట్టుబడిన నిందితుడి నేర చరిత్రపై పోలీసులు ఆరా తీస్తున్నారు. విధి నిర్వహణలో డీసీపీ సాయి చైతన్య చూపిన చొరవ, ధైర్యాన్ని పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**కాల్పుల్లో ఇద్దరు దొంగలకూ గాయాలయ్యాయి: సీపీ సజ్జనార్**

కాల్పుల ఘటనపై హైదరాబాద్ సీపీ సజ్జనార్ స్పందించారు. పట్టుబడిన వారిలో ప్రధాన నిందితుడు ఒమర్ అని, అతనిపై నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లలో 25 కేసులు నమోదై ఉన్నాయని మీడియాకు వెల్లడించారు. ఒమర్‌పై రౌడీషీట్ కూడా ఉందని తెలిపారు. 'నిందితుడు ఒమర్‌పై గతంలో రెండుసార్లు పీడీ యాక్ట్ ప్రయోగించాం. 2016లో కామాటిపురా పోలీస్ స్టేషన్ పరిధిలో, 2020లో హుస్సేనీ ఆలమ్ పోలీస్ స్టేషన్ పరిధిలో పీడీ యాక్ట్ కింద కేసులు నమోదయ్యాయి. రెండుసార్లు ఏడాది పాటు చంచల్‌గూడ జైలులో శిక్ష అనుభవించినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. జైలు నుంచి బయటకు వచ్చాక కాలాపత్తర్ పోలీస్ స్టేషన్‌లో మరో రెండు కేసులు నమోదయ్యాయి' అని పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.




## రూ.30 కోట్ల పార్కు స్థలం సేఫ్

**కబ్జా యత్నం భగ్నం.. కాపాడిన హైడ్రా**

కొండాపూర్, అక్టోబర్ 25 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని అత్యంత ఖరీదైన ప్రాంతాల్లో ఒకటైన కొండాపూర్‌లో భారీ భూకబ్జా యత్నాన్ని హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) అధికారులు అడ్డుకున్నారు. రాఘవేంద్ర కాలనీలో పార్కు కోసం కేటాయించిన రూ.30 కోట్ల విలువైన 2,000 చదరపు గజాల స్థలాన్ని నిన్న స్వాధీనం చేసుకున్నారు. కబ్జాదారులు నిర్మించిన అక్రమ షెడ్లను తొలగించి, భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. కొండాపూర్ రాఘవేంద్ర కాలనీ లేఅవుట్‌లో పార్కు, కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం 2,000 చదరపు గజాల స్థలాన్ని కేటాయించారు. అయితే, కొంతకాలంగా ఈ స్థలం ఖాళీగా ఉండటాన్ని గమనించిన కబ్జాదారులు దానిపై కన్నేశారు. నకిలీ బై-నంబర్లు సృష్టించి, ఆ స్థలాన్ని పది ప్లాట్లుగా విభజించారు. అంతేకాకుండా, ఆ ప్లాట్లలో తాత్కాలిక షెడ్లు కూడా నిర్మించారు. ఈ వ్యవహారంపై రాఘవేంద్ర కాలనీ సీ-బ్లాక్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రా 'ప్రజావాణి'లో ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన అధికారులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. అది పార్కు, కమ్యూనిటీ హాల్ కోసం కేటాయించిన స్థలమని నిర్ధారించుకున్న తర్వాత ఆక్రమణల తొలగింపు ప్రక్రియ చేపట్టారు. ఆశ్చర్యకరంగా, కబ్జాదారులు ఈ ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవడమే కాకుండా, భవన నిర్మాణానికి జీహెచ్ఎంసీ నుంచి అనుమతులు కూడా పొందారు. అయితే, ఈ వ్యవహారంపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ గతంలో జారీ చేసిన క్రమబద్ధీకరణ ఉత్తర్వులను, నిర్మాణ అనుమతులను రద్దు చేసింది. ప్రస్తుతం హైడ్రా అధికారులు ఆ స్థలాన్ని తమ అధీనంలోకి తీసుకుని, బోర్డును ఏర్పాటు చేశారు.

## ఆరో తరగతి విద్యార్థిపై సీనియర్ల లైంగిక దాడి

**నిర్మల్ జిల్లా బీసీ సంక్షేమ హాస్టల్‌లో దారుణ ఘటన**

నిర్మల్, అక్టోబర్ 25 (ఈవార్తలు): నిర్మల్ జిల్లాలో తీవ్ర కలకలం రేపిన ఓ అమానుష ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహంలో ఆరో తరగతి చదువుతున్న ఓ బాలుడిపై తొమ్మిదో తరగతి విద్యార్థులు ఇద్దరు లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ బీసీ సంక్షేమ విద్యార్థి వసతి గృహంలో చోటుచేసుకుంది. మస్కాపూర్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు స్థానిక బీసీ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. ఈ క్రమంలో ఈ నెల 21వ తేదీ అర్ధరాత్రి తొమ్మిదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ఆరో తరగతి చదువుతున్న ఓ బాలుడిని నిద్రలేపారు. వసతి గృహం పక్కకు తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ దారుణం గురించి బాధితుడు తన కుటుంబసభ్యులకు తెలియజేయడంతో వారు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వెంటనే పాఠశాలకు వచ్చి తమ కుమారుడికి టీసీ తీసుకుని, హాస్టల్ ఖాళీ చేయించి ఇంటికి తీసుకెళ్లారు. మరోవైపు, ఈ విషయాన్ని తోటి విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బోనగిరి నరేందర్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన హాస్టల్ వార్డెన్ ప్రకాశ్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం, అఘాయిత్యానికి పాల్పడిన ఇద్దరు విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి జరిగిన ఘటనను వివరించారు. ఆ తర్వాత ఈ నెల 23న వారిద్దరికీ టీసీలు ఇచ్చి పాఠశాల నుంచి పంపించివేశారు. ఈ వసతి గృహంలో, పాఠశాలలో ఇలాంటి ఘటనలు గతంలోనూ పలుమార్లు జరిగాయని, కానీ యాజమాన్యం వాటిని బయటకు పొక్కకుండా తొక్కిపెడుతోందన్న ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి.

## 4.9 కోట్ల ఫ్రాడ్.. ఏడుగురికి జైలు

హైదరాబాద్, అక్టోబర్ 25 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని కార్పొరేషన్ బ్యాంకులో సుమారు రూ.4.9 కోట్ల మోసానికి సంబంధించిన కేసులో సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. బ్యాంకు మాజీ సీనియర్ మేనేజర్‌తో సహా ఏడుగురిని దోషులుగా నిర్ధారించి, వారికి జైలు శిక్ష విధించింది. ఈ విషయాన్ని సీబీఐ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. వివరాల్లోకి వెళితే... కార్పొరేషన్ బ్యాంక్ బంజారాహిల్స్ బ్రాంచ్‌లో అప్పటి సీనియర్ మేనేజర్‌గా పనిచేసిన టి. చంద్రకాంత్‌కు రెండేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20,000 జరిమానా విధించారు. ఈ కేసులో రుణాలు పొందిన ప్రైవేటు వ్యక్తులైన వి.ఎన్.ఎస్.సి. బోస్, వి. రాజశ్రీ, కొండా శేఖర్ రెడ్డి, ఎన్.వి.పి. నంద కిశోర్, హెచ్. రాజశేఖర్ రెడ్డిలకు ఏడాది చొప్పున కఠిన కారాగార శిక్ష, రూ.55,000 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. నకిలీ, కల్పిత పత్రాల ఆధారంగా రూ.4.9 కోట్ల విలువైన గృహ రుణాలను మంజూరు చేసి బ్యాంకును మోసం చేశారన్న ఆరోపణలపై సీబీఐ 2004 సెప్టెంబర్ 29న చంద్రకాంత్‌తో సహా 16 మందిపై కేసు నమోదు చేసింది. లోతైన విచారణ జరిపిన సీబీఐ, 2007 మార్చి 30న చంద్రకాంత్‌తో పాటు మరో 11 మందిపై ఛార్జిషీట్ దాఖలు చేసింది. నిందితులందరూ కుమ్మక్కై, బ్యాంకింగ్ నిబంధనలను ఉల్లంఘించి, తమ అధికారిక హోదాలను దుర్వినియోగం చేస్తూ తప్పుడు పత్రాలతో రుణాలు పొంది బ్యాంకుకు నష్టం కలిగించారని విచారణలో తేలింది. రెండు దశాబ్దాలకు పైగా సాగిన సుదీర్ఘ విచారణ అనంతరం, హైదరాబాద్‌లోని సీబీఐ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి 2025 అక్టోబర్ 24న తీర్పు వెలువరించి ఏడుగురిని దోషులుగా తేల్చారు. ఇదిలా ఉండగా, ఘజియాబాద్‌లోని సీబీఐ ప్రత్యేక కోర్టు కూడా అక్టోబర్ 18న మరో బ్యాంకు మోసం కేసులో తీర్పు ఇచ్చింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నోయిడా ఎస్ఎస్ఐ బ్రాంచ్ మేనేజర్ మనోజ్ శ్రీవాస్తవకు నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.30,000 జరిమానా విధించింది. 2007-09 మధ్యకాలంలో తన పదవిని దుర్వినియోగం చేసి బ్యాంకుకు నష్టం కలిగించారనే ఆరోపణలపై 2010లో ఆయనపై కేసు నమోదైంది.

## ఆర్టీఏ మెరుపు దాడులు

**ప్రైవేట్ బస్సులపై కొరడా.. హైదరాబాద్‌లో పలు బస్సుల సీజ్**

బండ్లగూడ/హైదరాబాద్, అక్టోబర్ 25 (ఈవార్తలు): కర్నూలులో జరిగిన బస్సు అగ్ని ప్రమాదం ఘటన నేపథ్యంలో తెలంగాణ రవాణా శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. హైదరాబాద్ వ్యాప్తంగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై విస్తృత స్థాయిలో తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న పలు వాహనాలపై కేసులు నమోదు చేయడంతో పాటు కొన్నింటిని సీజ్ చేశారు. ఈ ఆకస్మిక తనిఖీలతో ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులు బెంబేలెత్తారు. రంగారెడ్డి జిల్లా బండ్లగూడ, వనస్థలిపురం ప్రాంతాల్లో ఆర్టీఏ అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 60కి పైగా వాహనాలను తనిఖీ చేయగా, నిబంధనలు పాటించని 12 బస్సులపై కేసులు నమోదు చేశారు. సరైన పత్రాలు, భద్రతా ప్రమాణాలు లేని 8 బస్సులను అక్కడికక్కడే సీజ్ చేసి సమీప పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మరోవైపు సంగారెడ్డి జిల్లా ముత్తంగి ఓఆర్ఆర్ ఎగ్జిట్-3 వద్ద, రాజేంద్రనగర్ పరిధిలోని గగన్‌పహాడ్ వద్ద కూడా అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్ వస్తున్న బస్సులను ఆపి సోదాలు నిర్వహించారు. బస్సుల్లో ఫైర్ సేఫ్టీ పరికరాలు, మెడికల్ కిట్ల లభ్యతను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎల్బీనగర్‌లోని చింతలకుంట వద్ద కూడా పలు వాహనాలపై కేసులు నమోదు చేశారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ తనిఖీలు నిర్వహిస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ఈ తనిఖీలు రాబోయే రోజుల్లోనూ కొనసాగుతాయని వారు స్పష్టం చేశారు.

## భారత్‌తో పెట్టుకుంటే చిత్తవుతావ్

**పాకిస్థాన్‌ను హెచ్చరించిన మాజీ సీఐఏ అధికారి**

న్యూయార్క్: భారత్‌తో సంప్రదాయ యుద్ధం జరిగితే పాకిస్థాన్ ఓటమి పాలవడం ఖాయమని అమెరికా నిఘా సంస్థ సీఐఏ (సీఐఏ) మాజీ అధికారి జాన్ కిరియాకు సంచలన వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్‌లో కౌంటర్ టెర్రరిజం ఆపరేషన్స్‌కు నాయకత్వం వహించిన ఆయన, వార్తా సంస్థ ఏఎన్ఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు కీలక విషయాలను వెల్లడించారు. భారత్‌ను నిరంతరం రెచ్చగొట్టడం వల్ల పాకిస్థాన్‌కు ఎలాంటి ప్రయోజనం చేకూరదని ఆయన స్పష్టం చేశారు. "అణుయుద్ధం గురించి పక్కనపెడితే, కేవలం సంప్రదాయ యుద్ధంలో పాకిస్థానీయులు ఓడిపోతారు. దీనివల్ల వారికి అక్షరాలా ఎలాంటి మంచి జరగదు. ఈ విషయాన్ని పాక్ విధానకర్తలు గ్రహించాలి" అని కిరియాకు విశ్లేషించారు. 2001లో భారత పార్లమెంటుపై ఉగ్రదాడి జరిగిన తర్వాత, ఇరు దేశాల మధ్య యుద్ధం అనివార్యమని సీఐఏ భావించిందని ఆయన గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో 'ఆపరేషన్ పరాక్రమ్' ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా తమ పౌరులను ఇస్లామాబాద్ నుంచి తరలించడం కూడా ప్రారంభించిందని తెలిపారు. ఇదే సమయంలో ఆయన మరో సంచలన విషయాన్ని బయటపెట్టారు. పర్వేజ్ ముషారఫ్ హయాంలో పాకిస్థాన్ అణ్వాయుధాలు పరోక్షంగా అమెరికా సైన్యం (పెంటగాన్) నియంత్రణలోనే ఉన్నాయని తనకు అనధికారికంగా తెలిసిందని చెప్పారు. "ఆ సమయంలో సీఐఏ దృష్టి అంతా అల్ ఖైదా, ఆఫ్ఘనిస్థాన్‌పైనే ఉండేది.

విభేదాలను అంతర్గతంగా పరిష్కరించుకోండి

సీఎం, డిప్యూటీ సీఎం, పీసీసీలకు

కాంగ్రెస్ అధిష్ఠానం సూచన

# గొడవలతో రోడ్డెక్కొద్దు!

## స్థానిక సంస్థల ఎన్నికలు, రిజర్వేషన్ల అమలుపై చర్చలు

### 15 రోజుల్లోగా డీసీసీ అధ్యక్షుల నియామకం పూర్తికి నిర్ణయం

న్యూఢిల్లీ: గత కొన్ని రోజులుగా తెలంగాణ కాంగ్రెస్‌లో, ప్రభుత్వంలో జరుగుతున్న పరిణామాలపై కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం అసంతృప్తి వ్యక్తం చేసినట్లు ఏఐసీసీ వర్గాల ద్వారా తెలిసింది. ముఖ్యంగా మంత్రుల స్థాయిలోనే విభేదాలు రచ్చ కెక్కడంపై పార్టీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి కేసీ వేణు గోపాల్ రాష్ట్ర నేతలకు క్లాస్ తీసుకున్నట్లు సమాచారం. పార్టీలో అంతర్గతంగా చర్చించాల్సిన అంశాలను బహిరంగ వేదికలు, మీడియా ముందు మాట్లాడటాన్ని కేసీ తప్పుపట్టినట్లు తెలిసింది. డీసీసీ అధ్యక్ష నియామకాల అంశంపై చర్చించేందుకు శనివారం ఢిల్లీకి వచ్చిన తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌లు రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై కేసీ వేణుగోపాల్‌తో చర్చించారు. ఈ సందర్భంగా ఇటీవల పలువురు రాష్ట్ర మంత్రులు, నేతల మధ్య పొడచూపిన విభేదాలపై ఆయన ప్రశ్నించినట్లు తెలిసింది. అయితే, వివాదాలను పరిష్కరించే దిశగా తీసుకున్న చర్యలను ఆయనకు రాష్ట్ర నేతలు వివరించారు. సమస్యలపై అంతర్గతంగా చర్చించుకోవా లని, రచ్చకెక్కవద్దని నేతలకు కేసీ ఈ సందర్భంగా సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలు, బీసీలకు 42% రిజర్వేషన్లపైనా చర్చ జరిగినట్లు తెలిసింది. బీసీ రిజర్వేషన్లపై నవంబర్ 3న హైకోర్టులో విచారణ ఉన్నందున ఆ తర్వాత మరోసారి ఈ అంశంపై చర్చించాలని నిర్ణయించినట్లు సమాచారం. పార్టీ సంస్థాగత నిర్మాణంలో ప్రధానపాత్ర పోషించే జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల నియామకాలను పక్షం రోజుల్లో పూర్తి చేయాలని ఏఐసీసీ నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా పరిశీలకుల నుంచి అందిన నివేదికలు, స్థానిక సమీకరణలు, నేతల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూ సమర్థులైన వ్యక్తులను అధ్యక్షులుగా నియమించాలని నిర్ణయించారు. ముందునుంచీ చెబుతున్నట్లుగా పార్టీ పదవుల్లోనూ 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తూ, మహిళలకు ప్రాధాన్యమిస్తూ అన్ని వర్గాలవారికి న్యాయం చేయాలని భావిస్తోంది. మీనాక్షి నటరాజన్, రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, మహేశ్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాధన్‌లతో కేసీ వేణుగోపాల్ ఇందిరాభవన్‌లో శనివారం సమావేశమై రెండు గంటలపాటు చర్చించారు. రాష్ట్ర పరిశీలకుల నుంచి వచ్చిన పేర్లను ముందుపెట్టుకొని జిల్లాలవారీగా నేతల నుంచి విడివిడిగా అభిప్రాయాలను సేకరించారు. ఈ భేటీలో ప్రధానంగా జిల్లాలవారీగా పరిశీలనకు వచ్చిన ముగ్గురు అభ్యర్థుల పేర్లపై అభిప్రాయాలను సేకరించినట్లు తెలిసింది. ప్రతి ముగ్గురు పేర్లలో ఒక ఓసీ, ఒక బీసీ ఉన్నారని చెబుతున్నారు. జిల్లాల్లో ఉండే కుల సమీకరణలు, అభ్యర్థి బలాబలాలు, పార్టీపై ఉన్న నిబద్ధతను పరిగణనలోకి తీసుకొని అభ్యర్థిత్వాలపై చర్చించారు. కొన్ని జిల్లాల నుంచి మంత్రులు, ఎమ్మెల్యేల బంధువులు, మిత్రుల పేర్లు రాగా వాటిని పక్కనపెట్టారని, మరికొన్ని జిల్లాల్లో పార్టీ అధికారంలోకి వచ్చాక కొత్తగా చేరినవారి పేర్లను ప్రత్యేకంగా గుర్తించి జాబితా నుంచి తొలగించారని తెలుస్తోంది. ఇప్పటికే అధ్యక్ష పదవుల్లో ఉన్నవారిని సైతం జాబితాల నుంచి తొలగించి మిగతా పేర్లపైనే ఎక్కువగా చర్చలు జరిగినట్లు తెలిసింది. అభిప్రాయాల సేకరణ ప్రక్రియ పూర్తయిన దృష్ట్యా, ఇందులో 42 శాతం బీసీలు ఉండేలా హైకమాండ్ తన తదుపరి చర్చలు కొనసాగించనుంది. ప్రతి ఉమ్మడి జిల్లాకు ఒక ఓసీ, ఒక బీసీ అధ్యక్షుడు ఉండేలా అభిప్రాయాలు వచ్చినట్లు తెలిసింది. ఈ లెక్కన కచ్చితంగా 9 మంది రెడ్లు, 13%-%14 మంది బీసీలకు అవకాశం దక్కుతుందని చెబుతున్నారు. పార్టీ దీర్ఘకాలిక సంస్కరణల్లో భాగంగా జిల్లా యూనిట్లకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. నియోజకవర్గ అభ్యర్థులు మొదలు, పార్టీ, ప్రభుత్వ నియామకాల్లో వారి సూచనల మేరకే పదవుల పంపకాలు, జిల్లా స్థాయి సమస్యలపై పోరాటాలు చేసే స్వేచ్ఛ వారికి ఇచ్చే దిశగా ఈ భేటీలో సమాలోచనలు జరిగినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. సంస్థాగత ఎన్నికల నుంచి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలకు డీసీసీలే జవాబుదారీగా ఉండాలని, వారి అభిప్రాయం మేరకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పార్టీ విధానాల రూపకల్పన ఉండేలా భవిష్యత్తులో నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. 'కేసీతో సంస్థాగత వివరాలపై చర్చించాం. అడిగిన వివరాలు అందించాం. సలహాలు, సంప్రదింపులు జరిపాం'అని తెలిపారు. అయితే, ఎప్పటిలోగా డీసీసీలను ప్రకటిస్తారన్నది మాత్రం చెప్పలేదు. 15 రోజుల్లోగా డీసీసీలను ప్రకటించాలని ఏఐసీసీ భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

## వ్యవసాయ బావిలో పడి యువ రైతు మృతి

వేములవాడ, అక్టోబర్ 25 (ఈవార్తలు) వేములవాడ రూరల్ మండలం ఫజల్ నగర్ గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు తన స్వంత వ్యవసాయ బావిలో పడి కీసరి అనిల్ అనే యువ రైతు మృతి చెందాడు. శుక్రవారం రాత్రి ఈ దుర్ఘటన జరగగా, శనివారం ఉదయం గ్రామస్తులు అతడి మృతదేహాన్ని బావి నుండి వెలికి తీశారు. వివరాల్లోకి వెళ్తే... ఫజల్ నగర్‌కు చెందిన కీసరి అనిల్ శుక్రవారం రాత్రి పొలం పనుల నిమిత్తం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. ప్రమాదవశాత్తు ఆయన బావిలో జారిపడినట్లు తెలుస్తోంది. రాత్రంతా బావిలో ఉండగా, శనివారం ఉదయం అనిల్ కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వెతకగా, బావిలో పడి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే గ్రామస్తులు కలిసి మృతదేహాన్ని బయటకు తీశారు.యువ రైతు అనిల్ అకాల మరణంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడు అనిల్‌కు భార్యతో పాటు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.



## వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన సత్యం

మల్యాల, అక్టోబర్ 25 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ముత్యంపేట, రామన్నపేట గ్రామాలలో ఐకేపీ ద్వారా నిర్వహించనున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం డాక్టర్ మేడిపెల్లి సత్యం ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం ఏ గ్రేడ్ రకానికి రూ.2389, కామన్ గ్రేడ్ రకానికి రూ.2369..కనీస మద్దతు ధర పొందాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించి రైతులు వరి ధాన్యాన్ని 17% లోపు తేమ వచ్చేలా ఆరబెట్టుకొని వరి ధాన్యం విక్రయించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బత్తిని మల్లేశ్వరి శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ జీవన్ రెడ్డి, ఆర్డీవో మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గానికి 5 కోట్లు అడిగా

### టీడీపీతో పొత్తుపై జడ శ్రావణ్ సంచలన వ్యాఖ్యలు

విజయవాడ,అక్టోబర్ 25 (ఈవార్తలు): జై భీమ్ భారత్ పార్టీ అధ్యక్షుడు, న్యాయవాది జడ శ్రావణ్ కుమార్ సంచలన విషయాలు వెల్లడించారు. గత సార్వత్రిక ఎన్నికలకు ముందు టీడీపీత తో పొత్తు కోసం తాను నియోజకవర్గానికి కోటి రూపాయలు కాదు, ఏకంగా ఐదు కోట్ల రూపాయలతో పాటు ఐదు అసెంబ్లీ సీట్లు డిమాండ్ చేశానని ఆయన అంగీకరించారు. ఓ యూట్యూబ్ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. "మీరు టీడీపీని 170 నియోజకవర్గాలకు కోటి చొప్పున అడిగారట కదా?" అని ప్రశ్నించగా "టీడీపీతో పొత్తు చర్చల సమయంలో నియోజకవర్గానికి కోటి కాదు, రూ. 5 కోట్లు, ఐదు సీట్లు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశాను. ఇది రాజకీయ ప్రక్రియలో భాగమే. ఐదేళ్లపాటు ప్రజల కోసం పోరాడిన మేము అసెంబ్లీలో ఉండాలనుకోవడంలో తప్పేముంది?" అని శ్రావణ్ కుమార్ స్పష్టం చేశారు. అయితే, చివరి నిమిషంలో చంద్రబాబు అరెస్ట్ కావడం, ఆ తర్వాత జనసేన, బీజేపీ కూటమిలోకి రావడంతో తమ లాంటి చిన్న పార్టీలను పక్కన పెట్టారని ఆయన వివరించారు. భవిష్యత్ రాజకీయాలపై మాట్లాడుతూ, 2029 నాటికి బలమైన రాజకీయ శక్తిగా ఎదగడమే తన లక్ష్యమని తెలిపారు. "రాబోయే నాలుగేళ్లలో కనీసం 10 నుంచి 15 లక్షల ఓటు బ్యాంకును సాధించేందుకు కృషి చేస్తాం. అప్పుడు మా డిమాండ్లకు బలం చేకూరుతుంది. ప్రభుత్వాలను ప్రభావితం చేసే శక్తి మాకు వస్తుంది. మా వర్గం ప్రజల హక్కులను కాపాడటానికి అధికారం అవసరం" అని ఆయన పేర్కొన్నారు. రాజకీయంగా పరిస్థితులు అనుకూలిస్తే భవిష్యత్తులో జగన్ పార్టీతో కలిసి పనిచేయడానికైనా సిద్ధమేనని, అది ఆనాటి రాజకీయ సమీకరణాలపై ఆధారపడి ఉంటుందని అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా గత వైసీపీ ప్రభుత్వ బాటలోనే పయనిస్తోందని జడ శ్రావణ్ విమర్శించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడే వారిపై, మీడియాపై కేసులు పెట్టడం ప్రజాస్వామ్య విరుద్ధమని అన్నారు. "గత ప్రభుత్వం చేసిన తప్పులనే మీరు కూడా పునరావృతం చేస్తే ప్రజలు మిమ్మల్ని కూడా క్షమించరు. కర్రు కాల్చి వాత పెట్టిన రోజున నిలువ నీడ లేకుండా పోతుంది" అంటూ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తే అది ప్రభుత్వాల మనుగడకే ప్రమాదమని ఆయన సూచించారు.




## సిరిసిల్ల అడిషనల్ కలెక్టర్‌కు రాజన్న ప్రసాదం

సిరిసిల్ల, అక్టోబర్ 25 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా అడిషనల్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన గరీమా అగర్వాల్‌ను వేములవాడ రాజన్న ఆలయ ఈవో రమాదేవి కలిసి ప్రసాదం అందజేశారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయల సముదాయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో సత్కరించారు. ఆలయ అర్చకులు వారికి వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల పురోగతిని గరీమాకు ఈవో వివరించారు.



## కోస్తా జిల్లాల బీచ్‌లలో ప్రవేశం నిషిద్ధం

మొంథా తుపాను ఎఫెక్ట్

వైజాగ్, అక్టోబర్ 25 (ఈవార్తలు): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుపానుగా బలపడే అవకాశం ఉన్నందున ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. 'మొంథా' తుపాను నేపథ్యంలో, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు విపత్తుల నిర్వహణ సంస్థ ముందస్తు చర్యలు చేపట్టింది. సహాయక చర్యల నిమిత్తం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేయడంతో పాటు, కోస్తా జిల్లాలకు కీలక సూచనలు జారీ చేసింది. ఈ మేరకు విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వివరాలు వెల్లడించారు. సముద్రం అలజడిగా ఉండి, అలలు ఎగసిపడే ప్రమాదం ఉన్నందున బుధవారం వరకు నదులు, సముద్ర తీరాల్లో చేపల వేటను పూర్తిగా నిలిపివేయాలని ఆదేశించారు. అదేవిధంగా, అన్ని రకాల బోటింగ్ కార్యకలాపాలను, బీచ్‌లకు పర్యాటకుల ప్రవేశాన్ని కూడా నిషేధించాలని కోస్తా జిల్లాల కలెక్టర్లకు సూచించారు. తుపానును ఎదుర్కొనేందుకు నిర్దేశించిన విధివిధానాలను పక్కాగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఈ వాయుగుండం పోర్ట్ బ్లెయిర్‌కు 510 కి.మీ, చెన్నైకి 890 కి.మీ, విశాఖపట్నం, కాకినాడలకు 920 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉందని ప్రఖర్ జైన్ తెలిపారు. దీని ప్రభావంతో ఆదివారం నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, ఇతర జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉందన్నారు. సోమ, మంగళవారాల్లో రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సహాయక చర్యల కోసం 8 ఎన్డీఆర్ఎఫ్, 9 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను వివిధ జిల్లాల్లో సిద్ధంగా ఉంచినట్లు ప్రఖర్ జైన్ వివరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు జారీచేసే హెచ్చరికలను పాటిస్తూ సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు.

## అనారోగ్యంతో అంగన్వాడీ టీచర్ ఆత్మహత్య

చందుర్తి, అక్టోబర్ 25 (ఈవార్తలు):కడుపునొప్పి సమస్యతో గత కొంతకాలంగా బాధపడుతున్న అంగన్వాడీ టీచర్ మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ విషాదకర ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలోని దేవుని తండా గ్రామంలో చోటు చేసుకుంది. సనుగుల గ్రామానికి చెందిన గొట్టే పరిమళ (36) దేవుని తండాలో అంగన్వాడీ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఆమె భర్త ఆర్టీసీ బస్సు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పరిమళ గత 8 నెలలుగా గర్భసంచిలో గడ్డల సమస్యతో బాధపడుతున్నారు. ఈ సమస్యకు పలు ఆసుపత్రుల్లో చికిత్స తీసుకున్నా, ఎన్ని మందులు వాడినా కడుపునొప్పి తగ్గకపోవడంతో ఆమె తీవ్ర మనోవేదనకు లోనయ్యారు. ఈ క్రమంలోనే శనివారం ఉదయం సుమారు 8:30 గంటల ప్రాంతంలో, ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని చూసి, తన బెడ్ రూమ్‌లోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సభ్యులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి కుటుంబ సభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు చందుర్తి ఎస్సై రమేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## 'మొంథా' తుఫాను వస్తోంది

### అప్రమత్తంగా ఉండండి.. చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్

అమరావతి, అక్టోబర్ 25 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంపై 'మొంథా' తుపాను విరుచుకుపడనుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. యూఏఈ పర్యటన నుంచి తిరిగి వచ్చిన ఏపీ సీఎం చంద్రబాబు శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, తుపాను ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగాన్ని సన్నద్ధం చేశారు. ఎక్కడా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడటమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు. వాతావరణ శాఖ జారీ చేసిన రెడ్ అలెర్ట్‌ను ప్రస్తావిస్తూ, ఈ నెల 26, 27, 28, 29 తేదీల్లో తుపాను ప్రభావం రాష్ట్రంపై తీవ్రంగా ఉంటుందని సీఎం తెలిపారు. ముఖ్యంగా ఈ నెల 28వ తేదీ సాయంత్రం కాకినాడ సమీపంలో 'మొంథా' తీవ్ర తుపానుగా తీరం దాటుతుందని, ఆ సమయంలో గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీస్తాయని అంచనా వేస్తున్నట్లు వివరించారు. దీని ప్రభావం శ్రీకాకుళం నుంచి తిరుపతి వరకు ఉంటుందని, 80 నుంచి 100 మిల్లీమీటర్ల మేర భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ఇప్పటి నుంచే



సమగ్ర సన్నాహక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. "ఈ విపత్తు సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడటం కంటే ముఖ్యమైనది ఏదీ లేదు. ప్రతి జిల్లా కలెక్టర్ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలి. తక్షణమే సహాయక చర్యలు చేపట్టేందుకు అవసరమైన వనరులను సమకూర్చుకోవాలి" అని చంద్రబాబు నిర్దేశించారు. తీరప్రాంత ప్రజలకు తుఫాన్ తీవ్రతపై అవగాహన కల్పించి, వారిని సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని సూచించారు. పరిస్థితులను బట్టి విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించే అధికారాన్ని కలెక్టర్లకే అప్పగించారు. అన్ని ప్రధాన, మధ్య తరహా జలాశయాల్లో నీటిమట్టాలను నిరంతరం పర్యవేక్షించాలని, నీటి విడుదలను శాస్త్రీయ పద్ధతిలో చేపట్టాలని ఇరిగేషన్ అధికారులకు స్పష్టం చేశారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను ముందుగానే ప్రభావిత ప్రాంతాలకు తరలించి, సహాయక చర్యలకు సిద్ధంగా ఉంచాలన్నారు. కాకినాడలో 'హాస్పిటల్ ఆన్ వీల్స్' సేవలను అందుబాటులో ఉంచాలని ప్రత్యేకంగా సూచించారు. ఆర్ అండ్ బీ, విద్యుత్, నీటిపారుదల, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, మొబైల్ టవర్స్, నిత్యావసరాల పంపిణీ వంటి అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. తుపాను ప్రభావిత జిల్లాలకు ప్రత్యేకంగా ఇన్‌ఛార్జి అధికారులను నియమించి, క్షేత్రస్థాయిలో నష్ట నివారణ చర్యలను పర్యవేక్షించాలని ఆదేశించారు.

## ఎక్కడ భూమి ఇస్తే అక్కడ హైటెక్ ఎయిర్‌పోర్టు

### కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి

న్యూఢిల్లీ: "గత పదేళ్లలో దేశంలో ఎన్నో విమానాశ్రయాలను నిర్మించాం. ఈ విషయంలో మేం నిపుణులమయ్యాం. మీరు ఎక్కడైనా భూమి ఇవ్వండి, మేం అక్కడ అత్యాధునిక విమానాశ్రయాన్ని నిర్మిస్తాం" అని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ధీమా వ్యక్తం చేశారు. శనివారం నాడు ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆధునికీకరించిన టెర్మినల్ 2ను ఆయన ప్రారంభించారు. కాగా, విస్తరణ పనుల కోసం ఏప్రిల్ 2025 నుంచి మూసివేసిన ఈ టెర్మినల్, ఆదివారం తిరిగి కార్యకలాపాలు ప్రారంభించనుంది. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, భారత విమానయాన రంగంలో రాబోయే రోజుల్లో భారీ విస్తరణ చేపట్టనున్నట్లు తెలిపారు. 2047 నాటికి దేశంలో విమానాశ్రయాల సంఖ్యను 350కి పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 164 విమానాశ్రయాలు పనిచేస్తున్నాయని, రానున్న రెండు దశాబ్దాల్లో మరో 200 ఎయిర్‌పోర్ట్‌లను నిర్మించాలనే లక్ష్యంతో ఉన్నామని మంత్రి వివరించారు. "విమానాశ్రయాలను నిర్మించడం ఇప్పుడు పెద్ద సవాల్ కాదు, భారత్‌కు మరిన్ని విమానాలను తీసుకురావడం ఎలా అనేదే అసలైన సవాల్" అని ఆయన వ్యాఖ్యానించారు. ఢిల్లీ విమానాశ్రయాన్ని అంతర్జాతీయ ఏవియేషన్ హబ్‌గా మార్చే బృహత్తర ప్రణాళికలో టెర్మినల్ 2 ఆధునికీకరణ ఒక కీలకమైన ముందడుగు అని పేర్కొన్నారు. ఢిల్లీ విమానాశ్రయంపై ప్రయాణికుల రద్దీ భారీగా పెరిగిన నేపథ్యంలో, దీని సామర్థ్యాన్ని 120 మిలియన్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. టెర్మినల్ 2 విస్తరణతో సుమారు 15 మిలియన్ల సీట్ల సామర్థ్యం పెరుగుతుందని అంచనా వేస్తున్నామన్నారు. దీంతో ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ ప్రపంచంలోని ప్రతిష్ఠాత్మక '100 మిలియన్ ప్లస్' క్లబ్‌లో చేరింది. ప్రపంచవ్యాప్తంగా కేవలం ఆరు విమానాశ్రయాలకు మాత్రమే ఈ ఘనత ఉంది. ఏఐ-171 విమాన ప్రమాదంపై అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ, దీనిపై 'సమగ్ర దర్యాప్తు' జరుగుతోందని, దానికి కచ్చితమైన కాలపరిమితి చెప్పలేమని అన్నారు. ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ నిబంధనలకు అనుగుణంగా దర్యాప్తు చేస్తోందని వివరించారు. ఇదే సమయంలో, ప్రమాదానికి గురైన విమానం బ్లాక్ బాక్స్‌ను తొలిసారిగా భారత్‌లోనే డీకోడ్ చేశామని, ఇది దేశీయంగా సాధించిన ఒక పెద్ద సాంకేతిక విజయమని పేర్కొన్నారు.



# భారత్ గొప్ప ప్రజాస్వామ్య దేశం



## నోబెల్ శాంతి బహుమతి విజేత ప్రశంసలు

**నోబెల్ శాంతి బహుమతి 2025 గ్రహీత, వెనిజులా ప్రజాస్వామ్య ఉద్యమకారిణి మరియా కొరినా మచాడో భారత్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. భారత్ ఒక 'గొప్ప ప్రజాస్వామ్యం' అని, ప్రపంచంలోని అనేక దేశాలకు 'ఒక ఉదాహరణ' అని ఆమె కొనియాడారు. వెనిజులాలో ప్రజాస్వామ్యం పునరుద్ధరింపబడిన తర్వాత భారత్‌తో అన్ని రంగాల్లో సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని, భారత్ తమకు గొప్ప మిత్రదేశం కాగలదని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే ప్రధాని నరేంద్ర మోదీతో మాట్లాడాలని ఆశిస్తున్నానని, స్వేచ్ఛాయుత వెనిజులాలో ఆయనకు ఆతిథ్యం ఇవ్వాలనుకుంటున్నానని తెలిపారు.**

న్యూఢిల్లీ: గత 15 నెలలుగా అజ్ఞాతంలో ఉన్న ఆమె 'టైమ్స్ నౌ' వార్తా సంస్థకు ఇచ్చిన ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. "ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా భారత్ ఎన్నో దేశాలకు, తరాలకు ఆదర్శంగా నిలిచింది. ఇది చాలా గొప్ప విషయం. ప్రజాస్వామ్యాన్ని ఎప్పుడూ తేలికగా తీసుకోకూడదు, దానిని నిరంతరం బలోపేతం చేసుకోవాలి. ప్రపంచంలోని ఎన్నో దేశాలు మీ వైపు చూస్తున్నాయి" అని ఆమె అన్నారు. తాను భారత్‌ను మనస్ఫూర్తిగా ఆరాధిస్తానని, తన కుమార్తె కొన్ని నెలల క్రితమే భారత్‌ను సందర్శించిందని, అక్కడి సంస్కృతిని ఎంతో ఇష్టపడిందని ఆమె చెప్పారు. మహాత్ముడి అహింసాయుత పోరాటం తనకు స్ఫూర్తినిచ్చిందని, శాంతియుతంగా ఉండటం బలహీనత కాదని గాంధీ ప్రపంచానికి చాటిచెప్పారని ఆమె పేర్కొన్నారు. వెనిజులాలో నెలకొన్న రాజకీయ సంక్షోభం గురించి మాట్లాడుతూ, 2024 జులై 28న జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో తమ కూటమి ఘన విజయం సాధించినప్పటికీ, నికోలస్ మదురో ప్రభుత్వం ఫలితాలను తారుమారు చేసిందని ఆమె ఆరోపించారు. "విపక్షాల అభ్యర్థిగా ప్రైమరీ ఎన్నికల్లో నేను 93 శాతం ఓట్లతో గెలిచాను. కానీ, నియంతృత్వ ప్రభుత్వం నన్ను పోటీ చేయనీయకుండా నిషేధం విధించింది. దాంతో, ఓ దౌత్యవేత్త మా తరఫున నిలబడ్డారు. మేము 70 శాతం ఓట్లతో గెలిచాం. దీనికి సంబంధించిన 85 శాతం ఓటింగ్ పత్రాలను డిజిటలైజ్ చేసి ఆధారాలుగా సేకరించాం. మేం గెలిచిన తర్వాత చర్చల ద్వారా అధికార మార్పిడికి మదురోకు అవకాశం ఇచ్చినా ఆయన నిరాకరించారు. ఆ తర్వాత దేశ చరిత్రలోనే అత్యంత దారుణమైన అణచివేతకు పాల్పడ్డారు. వేలాది మంది అమాయకులు అదృశ్యమయ్యారు. మహిళలు, చిన్నారులపై చిత్రహింసలకు పాల్పడ్డారు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

# పాక్‌కు ప్రజాస్వామ్యం తెలియదు

**ఐరాసలో దాయాదిపై భారత్ ఫైర్**

జెనీవా: ఐక్యరాజ్యసమితి వేదికగా పాకిస్థాన్‌పై భారత్ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. సైన్యం నీడలో నడిచే పాకిస్థాన్‌కు ప్రజాస్వామ్యం, రాజ్యాంగం వంటి భావనలు అస్సలు తెలియవని, కశ్మీర్‌కు ఆ ఆదర్శాలే ప్రాణమని ఘాటుగా వ్యాఖ్యానించింది. పాక్ అక్రమంగా ఆక్రమించుకున్న ప్రాంతాల్లో (పీఓకే) జరుగుతున్న అణచివేతను వెంటనే ఆపాలని డిమాండ్ చేసింది. ఐరాస 80వ వార్షికోత్సవం



సందర్భంగా భద్రతా మండలి సమావేశంలో భారత శాశ్వత ప్రతినిధి పి. హరీశ్ శుక్రవారం మాట్లాడారు. "జమ్మూకశ్మీర్ ప్రజలు భారత రాజ్యాంగ చట్రంలో, ప్రజాస్వామ్య సంప్రదాయాల ప్రకారం తమ ప్రాథమిక హక్కులను వినియోగించుకుంటున్నారు. అయితే, ఈ భావనలు పాకిస్థాన్‌కు ఏమాత్రం పరిచయం లేనివని మాకు తెలుసు" అని ఆయన అన్నారు. పాక్ ఆక్రమిత ప్రాంతాల్లో జరుగుతున్న తీవ్ర మానవ హక్కుల ఉల్లంఘనలను అంతం చేయాలని పిలుపునిచ్చారు. అక్కడి ప్రజలు పాక్ సైనిక ఆక్రమణ, అణచివేత, వనరుల దోపిడీపై బహిరంగంగానే తిరుగుబాటు చేస్తున్నారని గుర్తుచేశారు. అంతకుముందు, పాకిస్థాన్ ప్రతినిధి అసిమ్ ఇఫ్తిఖార్ అహ్మద్ 1948 నాటి ప్రజాభిప్రాయ సేకరణ తీర్మానాన్ని ప్రస్తావించి పాత వాదనను తెరపైకి తెచ్చారు. దీనిని భారత్ బలంగా తిప్పికొట్టింది. 1948 నాటి భద్రతా మండలి తీర్మానం-47 ప్రకారం, పాకిస్థాన్ ముందుగా తాను ఆక్రమించిన ప్రాంతాల నుంచి తన సైన్యాన్ని, పౌరులను ఉపసంహరించుకోవాలని స్పష్టంగా ఉందని హరీశ్ తెలిపారు. ఆ ప్రాథమిక షరతును పాకిస్థాన్ ఎన్నడూ నెరవేర్చలేదని, కాబట్టి ప్రజాభిప్రాయ సేకరణ ప్రస్తావన కాలగర్భంలో కలిసిపోయిందని వివరించారు.

# వెన్నుపోటు పొడిచారు

**మాతో భోజనాలు చేసి బీజేపీకి సహకరించారు**

**ఒమర్ అబ్దుల్లా సంచలన వ్యాఖ్యలు**



శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో ఇటీవలే జరిగిన రాజ్యసభ ఎన్నికల ఫలితాలపై ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సంతృప్తి, అసంతృప్తి రెండూ వ్యక్తం చేశారు. నాలుగు స్థానాల్లో మూడింటిని నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) గెలుచుకోవడం సంతోషంగా ఉన్నప్పటికీ, మిత్రపక్షాల దగా కారణంగా ఒక సీటును బీజేపీకి కోల్పోయామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీనగర్‌లో విలేకరులతో ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ.. "నాలుగు సీట్లనూ గెలుచుకోవడానికి నేషనల్ కాన్ఫరెన్స్ అన్ని విధాలా ప్రయత్నించింది. కానీ, చిరకాలంగా మాతో కూటమిలో ఉన్న కొందరు మిత్రులు చివరి నిమిషంలో మాకు ద్రోహం చేశారు" అని ఒమర్ అన్నారు. "మాతో కూర్చుని, మాతో కలిసి భోజనం చేసిన వాళ్లే చివరికి బీజేపీ వైపు నిలబడటం దురదృష్టకరం. నేను వారి పేర్లు చెప్పదలుచుకోలేదు, ప్రజల ముందు వారే దోషులుగా నిలబడ్డారు" అని ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యంగా హంద్వారా ఎమ్మెల్యే సజ్జాద్ లోన్ ఓటింగ్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించుకోవడం బీజేపీ అవకాశాలకు స్పష్టంగా మేలు చేసిందని సీఎం పేర్కొన్నారు. "ఆయన కొన్ని కారణాల వల్ల ఓటు వేయకూడదని నిర్ణయించుకున్నారు, కానీ ఆయన చర్య పరోక్షంగా బీజేపీకి లాభం చేకూర్చింది" అని ఒమర్ వివరించారు. ఈ సందర్భంగా ఎన్‌సీ అభ్యర్థులకు మద్దతుగా నిలిచిన కాంగ్రెస్, స్వతంత్ర శాసనసభ్యులకు ఒమర్ అబ్దుల్లా కృతజ్ఞతలు తెలిపారు. "నేషనల్ కాన్ఫరెన్స్‌కు చెందిన ఒక్క ఓటు కూడా వృథా కానందుకు నేను సంతృప్తిగా ఉన్నాను" అని ఆయన అన్నారు. తమ పార్టీ అభ్యర్థులకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ, ఇతర పార్టీల సభ్యులతో సహా అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్‌సీ నుంచి కొత్తగా ఎన్నికైన రాజ్యసభ సభ్యులు పార్లమెంటులో కీలక ప్రజా సమస్యలను లేవనెత్తుతారని ఆయన తెలిపారు. "జమ్మూకశ్మీర్‌కు పూర్తి రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలన్న డిమాండ్‌ను వారు పార్లమెంటులో బలంగా వినిపిస్తారు. అలాగే, ఈ ప్రాంత ప్రత్యేక హోదాకు సంబంధించి మా అసెంబ్లీ ఆమోదించిన తీర్మానాన్ని ముందుకు తీసుకెళతారు" అని ఒమర్ స్పష్టం చేశారు. మరోవైపు, వినూత్నమైన ఉద్యానవన కార్యక్రమాల ద్వారా కశ్మీర్ లోయలో పర్యాటక సీజన్‌ను పొడిగించినందుకు ఫ్లోరికల్చర్ విభాగాన్ని సీఎం ప్రశంసించారు. "కశ్మీర్‌లో వేసవి తర్వాత పూలు పూయవనే అపోహ ఉండేది. తులిప్ గార్డెన్‌తో పర్యాటక సీజన్‌ను ముందుగా ప్రారంభించి, గుల్-ఎ-దావూద్ గార్డెన్‌తో పొడిగించడం ద్వారా పర్యాటకాన్ని గణనీయంగా పెంచవచ్చని మేము గ్రహించాం" అని చెబుతూ, ఇందుకు కృషి చేసిన తోటమాలి, అధికారులందరినీ ఆయన అభినందించారు.

# అమ్మాయి వేషంలో లాడెన్ పరార్

**బురఖా ధరించి మా పక్క నుంచే పోయాడు**

**మా బలగాలతో ఉన్న**

**అనువాదకుడూ అల్ ఖైదా మనిషే**

**సీఐఏ మాజీ అధికారి జాన్ కిరియాకో**



న్యూయార్క్: అమెరికాను వణికించిన అల్ ఖైదా చీఫ్ బిన్ లాడెన్ గురించి సీఐఏ మాజీ అధికారి జాన్ కిరియాకో ఓ ఆసక్తికర సంఘటనను తాజాగా వెల్లడించారు. 2001 సెప్టెంబర్ 11న అల్ ఖైదా టెర్రరిస్టులు విమానాలను హైజాక్ చేసి అమెరికాలోని ట్విన్ టవర్స్ ను కూల్చివేసిన సంగతి తెలిసిందే. ఈ దాడి తర్వాత అమెరికా బలగాలు అల్ ఖైదా చీఫ్ ఒసామా బిన్ లాడెన్ కోసం వేట మొదలు పెట్టాయి. అమెరికా బలగాలను ముఖ్యంగా సీఐఏను ముప్పుతిప్పలు పెట్టిన లాడెన్.. చివరకు 2011 మే 2న పాకిస్థాన్ లోని అబోట్టాబాద్ లో హతమయ్యాడు. ట్విన్ టవర్స్ ను కూల్చివేసిన పదేళ్ల తర్వాత లాడెన్ ను అమెరికా బలగాలు తుదముట్టించాయి. అయితే, లాడెన్ అంతకుముందే తమకు పట్టుబడేవాడని, త్రుటిలో తప్పించుకున్నాడని జాన్ కిరియాకో చెప్పారు. 2001 సెప్టెంబర్ 11న ట్విన్ టవర్స్ కూల్చివేత తర్వాతి నెలలో.. అంటే అక్టోబర్ లోనే ఆఫ్ఘనిస్థాన్ లోని టోరాబోరా కొండల్లో అల్ ఖైదా స్థావరాన్ని సీఐఏ బలగాలు చుట్టుముట్టాయని వివరించారు. ఆ సమయంలో బిన్ లాడెన్ కూడా అక్కడే ఉన్నాడని చెప్పారు. లాడెన్ కదలికలపై పక్కాగా నిఘా పెట్టి టోరాబోరా కొండల్లో అతడిని పట్టుకోవడమో లేక హతమార్చడమో చేసేందుకు ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్లామని వివరించారు. అల్ ఖైదా కూడా తమకు కౌంటర్ గా కుయుక్తులు పన్నిందని, అందులో మొదటగా తమ సానుభూతిపరుడిని మా వద్దకు పంపించిందని జాన్ కిరియాకో చెప్పారు. ఆఫ్ఘనిస్థాన్ లో లాడెన్ కోసం వేటాడుతున్న క్రమంలో తమకు స్థానిక భాషలు తెలిసిన అనువాదకుడి అవసరం ఏర్పడిందన్నారు. ఇందుకోసం తాము నియమించుకున్న స్థానికుడు అల్ ఖైదా సానుభూతిపరుడేనని తర్వాత తెలిసిందన్నారు. టోరాబోరా కొండలను చుట్టుముట్టిన తర్వాత టెర్రరిస్టుల నుంచి తమకు ఓ ప్రతిపాదన వచ్చిందన్నారు. తమ వద్దనున్న మహిళలు, పిల్లలను క్షేమంగా బయటకు పంపించాక తాము లొంగిపోతామని టెర్రరిస్టులు చెప్పారని, ఇందుకోసం సాయంత్రం దాకా వేచి ఉండాలని ప్రతిపాదించారని వివరించారు. తమకు అనువాదకుడిగా పనిచేసిన వ్యక్తి ఈ ప్రతిపాదనకు అధికారులను ఒప్పించాడన్నారు. తీరా సాయంత్రం మసక చీకట్లలో మహిళలతో పాటు బిన్ లాడెన్ కూడా ఓ బురఖా ధరించి తమ పక్క నుంచే వెళ్లిపోయాడని జాన్ కిరియాకో వివరించారు. నాడు అల్ ఖైదా టెర్రరిస్టుల ప్రతిపాదనకు ఒప్పుకోకుంటే లాడెన్ ను 2001లోనే తుదముట్టించే వాళ్లమని కిరియాకో తెలిపారు.

# ఓ జిల్లాలో 222 టన్నుల బంగారం

**రాజస్థాన్‌లో బయటపడ్డ కొత్త గనులు!**

**దేశ డిమాండ్‌లో 25 శాతం తీర్చే అవకాశం**

జైపూర్: దేశంలో అత్యధిక ఖనిజ సంపద కలిగిన రాష్ట్రాల్లో ఒకటైన రాజస్థాన్, ఇప్పుడు బంగారు నిల్వల విషయంలో మరోసారి వార్తల్లో నిలిచింది. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతమైన బన్స్‌వారా జిల్లాలో భారీగా బంగారు నిక్షేపాలు ఉన్నట్లు అధికారులు ధృవీకరించారు. ఈ ఆవిష్కరణతో బన్స్‌వారా.. దేశానికి కొత్త స్వర్ణ రాజధానిగా మారే అవకాశం ఉంది. జిల్లాలోని ఘటోల్ తెహసీల్ పరిధిలోని కంకారియా గ్రామంలో ఈ నిల్వలను గుర్తించారు. ఇప్పటికే ఇక్కడ ఉన్న భుకియా, జగ్‌పురా గనుల తర్వాత ఇది మూడో అతిపెద్ద బంగారు గనిగా నిలవనుంది. భూగర్భ శాస్త్రవేత్తలు జరిపిన సర్వేల ప్రకారం, కంకారియా ప్రాంతంలో దాదాపు 3 కిలోమీటర్ల మేర బంగారు ఖనిజం విస్తరించి ఉన్నట్లు బలమైన ఆధారాలు లభించాయి. ఈ ప్రాంతంలో మొత్తం 940.26 హెక్టార్ల విస్తీర్ణంలో 113.52 మిలియన్ టన్నుల బంగారు ఖనిజం ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ ఖనిజాన్ని శుద్ధి చేసిన తర్వాత సుమారు 222.39 టన్నుల స్వచ్ఛమైన బంగారం లభించవచ్చని నిపుణులు చెబుతున్నారు. రాజస్థాన్‌లో ఇప్పటివరకు వెలుగుచూసిన అతిపెద్ద బంగారు నిల్వల్లో ఇది కూడా ఒకటి కావడం గమనార్హం. కంకారియా-గారా ప్రాంతంలో బంగారంతో పాటు రాగి, నికెల్, కోబాల్ట్ వంటి ఇతర విలువైన ఖనిజాలు కూడా లభించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అన్ని అనుమతులు లభించి, మైనింగ్ కార్యకలాపాలు ప్రారంభమైతే, భారతదేశంలో బంగారం తవ్వకాలు జరిపే అతికొద్ది రాష్ట్రాల జాబితాలో రాజస్థాన్ కూడా చేరుతుంది. అంతేకాకుండా, భవిష్యత్తులో దేశం మొత్తం బంగారం డిమాండ్‌లో 25 శాతం వరకు ఒక్క బన్స్‌వారా జిల్లా నుంచే సరఫరా చేసే సామర్థ్యం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇదిలా ఉండగా, గతంలో భుకియా-జగ్‌పురా మైనింగ్ బ్లాక్‌ల కోసం ప్రభుత్వం నిర్వహించిన వేలంలో గెలిచిన సంస్థ.. అవసరమైన హామీ మొత్తాన్ని జమ చేయడంలో విఫలమైంది. దీంతో ప్రభుత్వం ఆ లైసెన్స్‌ను రద్దు చేసింది. ప్రస్తుతం ఈ బ్లాక్‌ల కోసం మళ్లీ టెండర్ల ప్రక్రియ పూర్తి కాగా, నవంబర్ 3న బిడ్లను తెరవనున్నారు.

# సినిమా అడ్డుగోడలు తొలగిపోవాలి

**సినీ నటి ప్రియమణి**

చెన్నై: ప్రముఖ నటి ప్రియమణి దక్షిణాది చిత్ర పరిశ్రమకు లభిస్తున్న ఆదరణపై తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఒకప్పుడు ప్రాంతీయ చిత్రాలను పట్టించుకోని ప్రేక్షకులు ఇప్పుడు వాటిని ఎంతగానో ఆదరిస్తున్నారని, ఈ మార్పు తనకు గర్వకారణంగా ఉందని అన్నారు. ప్రాంతీయ, హిందీ చిత్రాల మధ్య ఉన్న అడ్డుగోడలు నెమ్మదిగా తొలగిపోతున్నాయని, భవిష్యత్తులో ఈ సరిహద్దులు పూర్తిగా చెరిగిపోవాలని ఆశిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ప్రియమణి మాట్లాడుతూ.. "ప్రేక్షకులు ఇప్పటికైనా దక్షిణాది సినిమాలను చూస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఎప్పటినుంచో ఇక్కడ మంచి సినిమాలు వస్తున్నాయి, కానీ వాటికి గతంలో సరైన ప్రాధాన్యత దక్కలేదు. ప్రతి భాషలోనూ అద్భుతమైన చిత్రాలు రూపొందినా, వాటి గురించి మాట్లాడేవారు కూడా కాదు. కానీ ఇప్పుడు అలాంటి చిత్రాలే భారీ విజయాలు సాధించడం నిజంగా గొప్ప విషయం" అని తెలిపారు. సినిమాలతో పాటు వాటి వెనుక ఉన్న దర్శకులు, నిర్మాతలు, సాంకేతిక నిపుణుల గురించి కూడా చర్చించుకోవడం పరిశ్రమకు ఎంతో మంచిదని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ సానుకూల మార్పు ఎంతో అవసరమని, ఇది తనకు సంతోషాన్ని కలిగిస్తోందని వివరించారు. ప్రస్తుతం ప్రియమణి తన సెకండ్ ఇన్నింగ్స్‌లో భాగంగా క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా విభిన్న పాత్రలతో మెప్పిస్తున్నారు. తెలుగులో ఆమె చివరిగా 'కస్టడీ' చిత్రంలో కనిపించారు.

# మావోయిస్టు నేత ఇపిల్ ముర్ము మృతి

**పక్కా సమాచారంతో భద్రతా దళాల మెరుపుదాడి**

**కొన్ని నెలలుగా అసోంలో రహస్యంగా కార్యకలాపాలు**

గౌహతి: అసోంలో జరిగిన ఓ ఎన్‌కౌంటర్‌లో కీలక మావోయిస్టు నేత మృతి చెందాడు. ఇటీవల రైల్వే ట్రాక్‌పై జరిగిన పేలుడు ఘటనకు ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న ఇపిల్ ముర్మును కోక్రాఝర్ జిల్లాలో భద్రతా దళాలు మట్టుబెట్టాయి. శుక్రవారం రాత్రి జరిగిన ఈ ఘటనతో స్థానికంగా ఉద్రిక్తత నెలకొంది. పోలీసు వర్గాల కథనం ప్రకారం ఝార□ండ్‌కు చెందిన ఇపిల్ ముర్ము కొన్ని నెలలుగా అసోంలో రహస్యంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. 23న కోక్రాఝర్, సలకటి స్టేషన్ల మధ్య ఐఈడీ సాయంతో రైలు పట్టాలను పేల్చివేసిన ఘటన వెనుక అతడి హస్తం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో, ఇపిల్ ముర్ము కదలికలపై నిఘా ఉంచిన భద్రతా దళాలకు శుక్రవారం రాత్రి సలకటి ప్రాంతంలో ఉన్నట్లు నిర్దిష్ట సమాచారం అందింది. ఈ సమాచారంతో భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి ఆపరేషన్ ప్రారంభించాయి. దళాలను గమనించిన ముర్ము కాల్పులు జరపడంతో, భద్రతా సిబ్బంది ఎదురుకాల్పులు జరిపారు. ఈ కాల్పుల పోరులో ఇపిల్ ముర్ము తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన అనంతరం, ముర్ము నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్న ఇతర అనుచరుల కోసం భద్రతా దళాలు ఆ ప్రాంతంలో గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. ఈ ఆపరేషన్‌తో రాష్ట్రంలో మావోయిస్టు కార్యకలాపాలకు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లు అధికారులు భావిస్తున్నారు.

# జర్నలిస్టుకు 24 కత్తి పోట్లు

**దారుణంగా పొడిచి చంపిన నిందితులు**

ప్రయాగ్‌రాజ్: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో దారుణం చోటుచేసుకుంది. లక్ష్మీ నారాయణ్ సింగ్ అలియాస్ పప్పు సింగ్ (54) అనే జర్నలిస్టును దుండగులు అత్యంత కిరాతకంగా నరికి చంపారు. నగరంలోని ఓ హోటల్ సమీపంలో గురువారం ఈ ఘటన జరిగింది. మృతుడు హైకోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అశోక్ సింగ్‌కు మేనల్లుడు. పప్పు సింగ్‌పై కత్తులతో దాడి చేసిన నిందితులు ఆయన మెడ, పొట్ట, చేతులపై విచక్షణా రహితంగా పొడిచారు. ఆయన శరీరంపై 24కు పైగా లోతైన గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావంతో కుప్పకూలిన ఆయన్ను వెంటనే స్వరూప్ రాణి నెహ్రూ ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కొద్ది రోజుల క్రితం మృతుడికి, నిందితులకు మధ్య ఓ వివాదం జరిగిందని ప్రాథమిక విచారణలో తేలిందని అదనపు పోలీస్ కమిషనర్ అజయ్ పాల్ శర్మ తెలిపారు. అయితే, హత్యకు దారితీసిన కచ్చితమైన కారణాలపై లోతుగా విచారణ జరుపుతున్నామన్నారు. "ఈ హత్యకు సంబంధించి విశాల్ అనే నిందితుడిని అరెస్ట్ చేశాం. పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలిస్తున్నాం," అని అజయ్ పాల్ శర్మ మీడియాకు వివరించారు. మిగిలిన నిందితులను కూడా త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# సౌదీకి అద్దెకు పాక్ సైన్యం

**రూ.88 వేల కోట్లతో భారీ డీల్**

**25 వేల మంది సైనికులను సౌదీకి పంపనున్న పాక్**

**గత నెలలోనే కుదిరిన ఒప్పందం**

ఇస్లామాబాద్: ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న పాకిస్థాన్ తాజాగా తన సైన్యం సాయంతో నిధులు సమకూర్చుకునే ప్రయత్నం చేస్తోంది. సైనిక బలగాలను అద్దెకు ఇవ్వడం ద్వారా భారీగా నిధులు సమీకరించనున్నట్లు సమాచారం. మిత్రదేశం సౌదీ అరేబియాతో గత నెల కుదిరిన ఒప్పందంలో సైన్యాన్ని అద్దెకు ఇచ్చి రూ.88 వేల కోట్లు అందుకోనుంది. ప్రతిగా పాక్ సైనికులు 25 వేల మందిని సౌదీ అరేబియాకు పంపించనుంది. దీనికి సంబంధించి సెప్టెంబర్ 17వ తేదీన ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక పరస్పర రక్షణ ఒప్పందం కుదరగా.. తాజాగా బలగాల తరలింపునకు చర్యలు చేపట్టినట్లు సమాచారం. ఇరు దేశాల్లో ఒక దేశంపై దాడి జరిగితే మరో దేశం కూడా యుద్ధం చేయాలనేదే తాజా ఒప్పందం. ఇందుకోసం సౌదీ అరేబియా రూ.10 బిలియన్ డాలర్లు (దాదాపు 88 వేల కోట్ల రూపాయలు) పాక్ కు చెల్లించేందుకు అంగీకరించింది. ఇందుకు గానూ 25 వేల మంది తన సైనికులను పాకిస్థాన్ ప్రభుత్వం సౌదీకి పంపించనుంది. ఈ ఒప్పందంలోని పూర్తి వివరాలు గోప్యంగా ఉన్నప్పటికీ.. ఒక దేశంపై దాడిని మరో దేశంపై దాడిగా పరిగణించాలనే రక్షణ నిబంధన ఇందులో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, అటు సౌదీ కానీ ఇటు పాక్ కానీ ఈ ఒప్పందం వివరాలను సౌదీ అరేబియా కానీ, పాకిస్థాన్ కానీ అధికారికంగా వెల్లడించలేదు.

# కన్న కూతురిపై తండ్రి అఘాయిత్యం!

**ఫరీదాబాద్‌లో 14 ఏళ్ల బాలికపై తండ్రి లైంగికదాడి**

**మద్యం మత్తులో ఈ దారుణానికి పాల్పడినట్లు ఆరోపణలు**

**పోక్సో చట్టం కింద కేసు నమోదు.. నిందితుడు అరెస్ట్**

ఫరీదాబాద్: హర్యానాలోని ఫరీదాబాద్‌లో సభ్యసమాజం తలదించుకునే దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. కన్న కూతురిపైనే ఓ తండ్రి కొన్ని రోజులపాటు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ కేసుకు సంబంధించి 42 ఏళ్ల నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. నిందితుడు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. నిందితుడు మద్యానికి బానిసయ్యాడు. ఈ కారణంగానే అతడి భార్య కొన్నాళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో 7వ తరగతి చదువుతున్న 14 ఏళ్ల వారి పెద్ద కుమార్తె తండ్రితోనే ఉంటోంది. ప్రతిరోజూ రాత్రి మద్యం మత్తులో ఇంటికి వచ్చే నిందితుడు తన కుమార్తెపై అత్యాచారానికి పాల్పడేవాడు. తండ్రి పైశాచికత్వంతో తీవ్రమైన నొప్పితో బాధపడిన బాలిక, చివరకు ధైర్యం చేసి పక్కింటి వృద్ధురాలికి తన గోడు వెళ్లబోసుకుంది. ఆమె వెంటనే బాలికను వైద్యుని వద్దకు తీసుకెళ్లింది. వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్, బాలికపై అత్యాచారం జరిగినట్లు నిర్ధారించి, జరిగిన నేరాన్ని బహిర్గతం చేశారు. దీంతో ఆ వృద్ధురాలు పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు.. భూపాని పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టంలోని కఠినమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించామని, ఈ ఘటనపై తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.

# మోదీ నాకు మంచి మిత్రుడు

**భారత్‌కు నాయకత్వం వహించే సత్తా రాహుల్‌కు లేదు**

**అమెరికన్ గాయని మేరీ మిల్బెన్**

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ తనకు మంచి మిత్రుడని, ఆయన నాయకత్వం అద్భుతమని ప్రశంసలు కురిపించిన ప్రముఖ అమెరికన్ గాయని, నటి మేరీ మిల్బెన్... అదే సమయంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపైనా తన అభిప్రాయాలను పంచుకున్నారు. భారత్‌ను నడిపించేందుకు రాహుల్ గాంధీ సరైన వ్యక్తి కాదని ఆమె స్పష్టం చేశారు. ఆయన ఎక్కువ సమయం విదేశాల్లో గడుపుతూ, సొంత దేశం గురించే ప్రతికూలంగా మాట్లాడతారని ఆరోపించారు. ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మేరీ మిల్బెన్ మాట్లాడుతూ, "భారత్‌కు నాయకత్వం వహించేందుకు రాహుల్ గాంధీ తగిన వ్యక్తి అని నేను అనుకోవడం లేదు. ఈ విషయం ఇప్పటికే నిరూపితమైంది. ప్రధాని మోదీ వరుసగా ఎన్నికల్లో గెలిచారు. భారత ప్రజలు మూడుసార్లు తమ ఓటు ద్వారా మోదీనే ఉత్తమ నాయకుడని తీర్పు ఇచ్చారు" అని అన్నారు. రాహుల్ గాంధీ వైఖరిని ఆమె తప్పుబట్టారు. "ఆయన అమెరికా వచ్చినప్పుడల్లా భారత్ గురించీ, ప్రధాని మోదీ గురించీ తక్కువ చేసి మాట్లాడతారు. ఒక దేశాన్ని, దాని ప్రజలను నిరంతరం విమర్శిస్తూ, వారి నుంచి ఓట్లు ఎలా ఆశిస్తారు? అలాంటి వ్యక్తి దేశాన్ని ఎలా నడిపిస్తారు?" అని ఆమె ప్రశ్నించారు. కాంగ్రెస్ మద్దతుదారులు తనను ట్రోల్ చేస్తున్నా, తన అభిప్రాయానికి కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు.







## 'మాస్ జాతర'కు యూ/ఏ

మాస్ మహారాజ రవితేజ హీరోగా నటిస్తున్న అవైటెడ్ మాస్ చిత్రమే మాస్ జాతర. కొత్త దర్శకుడు భాను భోగవరపు తెరకెక్కించిన ఈ సినిమా రవితేజకి మంచి కం బ్యాక్ గా నిలవాలి అని అభిమానులు ఎదురు చూస్తున్నారు. ఇక ఆల్రెడీ ట్రైలర్ కి డేట్ ఫిక్స్ చేసుకున్న ఈ సినిమా ఫైనల్ గా సెన్సార్ పనులు కూడా పూర్తి చేసేసుకుంది. మరి సెన్సార్ పనులు అయ్యాక ఈ సినిమా యూ / ఏ సర్టిఫికెట్ ని పొందినట్లు మేకర్స్ రివీల్ చేశారు. సో ఇక థియేటర్స్ లో మాస్ ఆడియెన్స్ కి జాతరే అని చెప్పాలి. ఇక ఈ సినిమాకి భీమ్స్ సంగీతం అందిస్తున్నాడు అలాగే శ్రీ లీల హీరోయిన్ గా నటిస్తుండగా సితార ఎంటర్టైన్మెంట్స్ ఇంకా ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే. కాగా, రవితేజ పై ఒక మాస్ పోస్టర్ తో ట్రైలర్ ని మేకర్స్ ఈ అక్టోబర్ 27న రిలీజ్ చేస్తున్నట్లు కన్ఫర్మ్ చేసేసారు. ఇక ఈ ట్రైలర్ తో హైప్ ఎక్కడికి వెళుతుందో చూడాలి. ఇక ఈ చిత్రానికి భీమ్స్ సంగీతం అందిస్తుండగా సితార ఎంటర్టైన్మెంట్స్ అలాగే ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ నిర్మాణం వహించారు. అలాగే ఈ అక్టోబర్ 31న గ్రాండ్ గా రిలీజ్ కి రాబోతుంది.

## 30 మందికి చిరు నోటీసులు



టాలీవుడ్ స్టార్ హీరో చిరంజీవి తన పేరు, ఫొటోలు దుర్వినియోగంపై హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించాడు. ఈ నేపథ్యంలో చిరంజీవికి అనుకూలంగా తీర్పునిచ్చిన సిటీ సివిల్ కోర్టు చిరంజీవి పేరు, ఫొటో, వాయిస్, చిత్రాలు అనుమతి లేకుండా వాడొద్దని ఆదేశాలు జారీ చేసింది. చిరంజీవి పేరును కమర్షియల్ బెనిఫిట్స్ కోసం వాడకూడదని ఆదేశించిన కోర్టు.. మెగాస్టార్, చిరు, అన్నయ్య పేర్లతో డిజిటల్ ప్లాట్‌ఫాంలలో ఏఐ మార్ఫింగ్ చేయడంపై ఆంక్షలు విధించింది. టీఆర్‌పీ లాభాల కోసం చిరంజీవి పేరును ఎవరైనా దుర్వినియోగం చేస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ మేరకు చిరంజీవి పేరు, ఫొటోలు దుర్వినియోగం చేసిన 30 మందికి కోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను అక్టోబర్ 27కు వాయిదా వేసింది.

## దేవిశ్రీ డ్యుయెల్ రోల్?




'బలగం' చిత్రంతో సాలిడ్ హిట్ అందుకున్న వేణు యెల్దండి తన నెక్స్ట్ చిత్రంగా 'ఎల్లమ్మ' అనే సినిమాను తెరకెక్కించేందుకు రెడీ అయ్యాడు. ఈ సినిమా తెలంగాణ నేపథ్యంతో తెరకెక్కనున్నట్లు చిత్ర వర్గాల టాక్. అయితే, ఈ సినిమాలో తొలుత నాని హీరోగా నటిస్తాడనే వార్తలు వచ్చాయి. ఆ తర్వాత నితిన్ ఈ సినిమాకు ఓకే అని.. అటుపై తప్పుకున్నాడు. దీంతో ఇప్పుడు ఈ సినిమాలో దేవిశ్రీ ప్రసాద్ హీరోగా పరిచయం కాబోతున్నాడు. కాగా, ఈ సినిమాలో దేవిశ్రీ ప్రసాద్ కేవలం హీరోగా మాత్రమే కాకుండా సంగీత దర్శకుడిగా కూడా అలరించబోతున్నాడు.

## రతిక రోజ్.. హీరోయిన్‌గా చాన్స్

అదృష్టం ఎప్పుడు ఏ రూపంలో తలుపు తడుతుందో కష్టం. అయితే ఆ అదృష్టం పట్టినప్పుడే మనల్ని మనం నిరూపించుకోవాలి. ఈ క్రమంలోనే తాజాగా ఒక బిగ్ బాస్ బ్యూటీ కి ఏకంగా హీరోయిన్ గా అవకాశం లభించింది. ఏకంగా మూడు భాషల్లో ఈ సినిమా విడుదల కాబోతోంది అని తెలిసి అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఆ అదృష్టవంతురాలు ఎవరో కాదు బిగ్ బాస్ తెలుగు సీజన్ సెవెన్ లో తన పెర్ఫార్మన్స్ తో అందరిని ఆకట్టుకొని.. రెండుసార్లు ఎంట్రీ ఇచ్చిన రతిక రోజ్. ఇకపోతే ఒక వర్గం ఆడియన్స్ ను ఈమె మెప్పించినా.. చాలావరకు ఈమెపై నెగటివిటీ పెరిగిపోయిందనే చెప్పాలి. కారణం ట్రయాంగిల్ లవ్ స్టోరీ.. అందరికీ చిరాకు తెప్పించింది. అలా హౌస్ లో నెగెటివిటీ మూటగట్టుకుని బయటకు వచ్చిన ఈమె అదే సమయంలో తండ్రిని కోల్పోయి ఎన్నో ఇబ్బందులు కూడా ఎదుర్కొంది. ఇకపోతే ఈమధ్య చిన్నచితక పాత్రలు చేస్తూ ప్రేక్షకులను మెప్పిస్తున్న ఈమె.. ఇప్పుడు ఏకంగా హీరోయిన్గా నటించే అవకాశాన్ని అందుకుంది. అదే 'ఎక్స్ వై' చిత్రం. సీవీ కుమార్ దర్శకత్వంలో బ్రానా, అనిజ్ ప్రభాకర్, శ్రీధర్ తదితర లో కీలకపాత్రలు పోషించారు. శ్రీకృష్ణ పిక్చర్స్, శ్రీ ఇంటర్నేషనల్ బ్యానర్ పై ఎంకే సాంబశివం నిర్మించిన ఈ సినిమా తెలుగుతో పాటు తమిళ్ , మలయాళం భాషల్లో కూడా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా మూవీ పోస్టర్ ను తాజాగా మేకర్స్ విడుదల చేశారు. ఇరుది సుట్రు, పిజ్జా వంటి ప్రయోగాత్మక చిత్రాలను నిర్మించడంతోపాటు మాయావన్ చిత్రానికి దర్శకుడిగా పనిచేసి మంచి పేరు సొంతం చేసుకున్న సీవీ కుమార్ ఇప్పుడు మరో వైవిధ్యమైన కథాంశంతో ఎక్స్ వై అనే చిత్రంతో మన ముందుకు రాబోతున్నారు. ఇదొక డిఫరెంట్, న్యూ కంటెంట్ మూవీ అని కచ్చితంగా ప్రేక్షకుల మన్ననలు అందుకుంటుంది అని మేకర్స్ స్పష్టం చేస్తున్నారు.





## జాన్వీ సస్పెన్స్.. 29 అక్టోబర్!

బాలీవుడ్ లెజెండరీ నటి శ్రీదేవి వారసురాలిగా సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టిన జాన్వీ కపూర్, ఇప్పుడు తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సొంతం చేసుకుంది. తల్లి అడుగుజాడల్లో నడుస్తూ నటిగా ఎదిగిన జాన్వీ, ఇప్పుడు సౌత్ ఇండస్ట్రీ వైపు దృష్టి సారిస్తోంది. శ్రీదేవి సౌత్ నుంచి బాలీవుడ్‌కి వెళ్ళినప్పటికీ, జాన్వీ మాత్రం రివర్స్ ప్రయాణం చేస్తోంది. బాలీవుడ్‌లో 'ధడక్' వంటి చిత్రాలతో పేరు తెచ్చుకున్న ఆమె, టాలీవుడ్‌లో ఎన్టీఆర్ సరసన 'దేవర' సినిమాతో సత్తా చాటింది. ఈ సినిమా మంచి విజయం సాధించడంతో జాన్వీకి దక్షిణాదిలో కూడా ఫ్యాన్‌బేస్ పెరిగింది. ప్రస్తుతం ఆమె రామ్ చరణ్ జోడీగా 'పెద్ది' సినిమాలో నటిస్తోంది. ఈ చిత్రం పల్లెటూరి నేపథ్యంతో రూపొందుతుండగా, జాన్వీ అందులో గ్రామీణ యువతిగా కనిపించనుంది.

## అందరికీ తెలిసిందే కదా

రష్మిక మందన్నా ఈ మధ్యనే బాలీవుడ్ లో థామా అనే మూవీతో మన ముందుకు వచ్చింది. ఆయుష్మాన్ ఖురానా తో రష్మిక కలిసి నటించిన ఈ సినిమా అక్టోబర్ 21న థియేటర్లలో విడుదలైంది. అయితే ఈ సినిమా విడుదలైన కొద్ది రోజులకే మరో సినిమా ప్రమోషన్స్ లో పాల్గొంది ఈ ముద్దుగుమ్మ. తాజాగా ఈ హీరోయిన్ నటించిన ది గర్ల్ ఫ్రెండ్ మూవీ కూడా నవంబర్ 7న విడుదల కాబోతుండడంతో ఈ సినిమా ప్రమోషన్స్ లో కూడా పాల్గొంటూ సందడి చేస్తోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ది గర్ల్ ఫ్రెండ్ మూవీ నుండి ట్రైలర్ రిలీజ్ చేశారు చిత్ర యూనిట్. ఈ ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ లో చిత్ర యూనిట్ అందరు పాల్గొని సందడి చేశారు. అయితే ఈ ట్రైలర్ రిలీజ్ ఈవెంట్లో సినిమా గురించి అందరూ గొప్పగా చెబుతూ ఉండగా వెంటనే యాంకర్ మైక్ అందుకొని వాట్ ఈజ్ రష్మికాస్ టైప్.. హూ ఈజ్ రష్మికాస్ టైప్ అంటూ ప్రశ్నించింది.





## ప్రముఖ హాస్యనటుడు సతీష్ షా కన్నుమూత

బాలీవుడ్‌లో విషాదం నెలకొంది. ప్రముఖ బాలీవుడ్ హాస్యనటుడు సతీష్ షా కన్నుమూశారు. కొద్దిరోజులుగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్న ఆయన 74 ఏళ్ల వయసులో శనివారం తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని సినీ నిర్మాత అశోక్ పండిట్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఇక సతీష్ షా మరణవార్త తెలుసుకున్న బాలీవుడ్ సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా ఆయనకు నివాళులు అర్పిస్తున్నారు. సుమారు నాలుగు దశాబ్దాలకు పైగా సినీ, టీవీ పరిశ్రమల్లో సేవలందించిన సతీష్ షా 'సారభాయ్ వర్సెస్ సారభాయ్' అనే టీవి షోతో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. 'సారభాయ్ వర్సెస్ సారభాయ్' లో ఇంద్రవదన్ శరభాయ్‌గా ఆయన పోషించిన పాత్ర ఇండియన్ టీవీ చరిత్రలోనే అత్యంత ఐకానిక్ హాస్య పాత్రలలో ఒకటిగా నిలిచింది. ఇదేకాకుండా మై హూ నా', 'దిల్‌వాలే దుల్హనియా లేజాయేంగే', 'కల్ హెూ నా హెూ' వంటి హిట్ సినిమాలలో కామెడియన్‌గా రాణించాడు.

## మెస్సీ ఫ్యాన్స్‌కు బ్యాడ్ న్యూస్

**కేరళలో అర్జెంటీనా మ్యాచ్ వాయిదా**

భారత ఫుట్‌బాల్ అభిమానులు, ముఖ్యంగా లియోనెల్ మెస్సీ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న అర్జెంటీనా మ్యాచ్ వాయిదా పడింది. కేరళలోని కొచ్చి జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నవంబర్ 17న జరగాల్సిన ఈ ఫ్రెండ్లీ మ్యాచ్‌ను వాయిదా వేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. తదుపరి ఫిఫా అంతర్జాతీయ మ్యాచ్ విండోలో ఈ మ్యాచ్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మ్యాచ్ స్పాన్సర్ అయిన రిపోర్టర్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ఆంటో అగస్టిన్ సోషల్ మీడియా ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. అంతర్జాతీయ ఫుట్‌బాల్ సంస్థ ఫిఫా నుంచి అనుమతి రావడంలో జాప్యం జరగడం వల్లే, అర్జెంటీనా ఫుట్‌బాల్ అసోసియేషన్ (ఏఎఫ్ఏ)తో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తన ఫేస్‌బుక్ పోస్ట్‌లో వివరించారు. కొత్త తేదీని త్వరలోనే ప్రకటిస్తామని ఆయన తెలిపారు. అయితే, ఈ వాయిదా వెనుక మరో కారణం కూడా ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. స్పెయిన్‌కు చెందిన 'లా నేసియన్' మీడియా కథనం ప్రకారం, మ్యాచ్ ఆతిథ్యానికి కేరళ సరైన ప్రమాణాలను అందుకోలేకపోయిందని, పదేపదే ఒప్పంద ఉల్లంఘనలకు పాల్పడిందని ఏఎఫ్ఏ అధికారి ఒకరు తెలిపినట్లు సమాచారం. "నవంబర్‌లో మ్యాచ్ నిర్వహించేందుకు మేము అన్ని విధాలా ప్రయత్నించాం. మా ప్రతినిధి బృందం భారత్‌కు వచ్చి స్టేడియం, హోటల్ వంటివి పరిశీలించింది. కానీ చివరికి, భారత్ అవసరమైన ప్రమాణాలను అందుకోలేకపోయింది. అందుకే ఈ ఒప్పందాన్ని పునఃసమీక్షించి కొత్త తేదీని ఖరారు చేస్తాం" అని ఏఎఫ్ఏ అధికారి చెప్పినట్లు ఆ కథనం పేర్కొంది. ప్రపంచ ఛాంపియన్ అర్జెంటీనా జట్టు కేరళలో ఆడనుందని రాష్ట్ర క్రీడల మంత్రి ప్రకటించినప్పటి నుంచి ఈ మ్యాచ్‌పై గందరగోళం కొనసాగుతూనే ఉంది.





# రో-కో

### రోహిత్ సూపర్ సెంచరీ.. కోహ్లి గ్రేట్ రికార్డు
### టీమ్ ఇండియా గెలుపు.. తప్పిన క్లీన్ స్వీప్ ముప్పు

## రీలోడెడ్!

ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ మూడో మ్యాచ్ లో టీమ్ ఇండియా విజయం సాధించింది. తొలి రెండు మ్యాచ్ లలో ఓడి విమర్శలు ఎదుర్కొన్న భారత జట్టు ఈసారి మాత్రం పూర్తి నియంత్రణలో ఆడింది. టాస్ ఓడి బౌలింగ్ చేసినప్పటికీ ప్రత్యర్థిని 236 పరుగులకే నిలువరించింది. ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ లో కెప్టెన్ షాన్ మార్ష్ (41), ట్రావిస్ హెడ్ (29)లు మొదటి వికెట్ కు 9.2 ఓవర్లలోనే 61 పరుగులు జోడించారు.

ఈ ఊపు చూస్తే కంగారూలు భారీ స్కోరు సాధించడం ఖాయం అనిపించింది. కానీ, భారత బౌలర్లు పుంజుకుని వరుసగా వికెట్లు తీశారు. మాథ్యూ షార్ట్ (30), రైన్ షా (56), క్యారీ (24) మెరుగ్గా ఆడినా భారీ స్కోరు అందించలేకపోయారు. మోస్తరు టార్గెట్ తో బరిలో దిగిన టీమ్ ఇండియాకు మాజీ కెప్టెన్, స్టార్ బ్యాట్స్ మన్ రోహిత్ శర్మ సాధికార బ్యాటింగ్ గెలుపును సునాయాసం చేసింది.

పెర్త్ లో జరిగిన తొలి వన్డేలో 8 పరుగులకే ఔట్ అయి విమర్శలు ఎదుర్కొన్న రోహిత్.. ఆడిలైడ్ లో రెండో వన్డేలో 73 పరుగులతో రాణించాడు. శనివారం మూడో వన్డేలో మాత్రం మరింత చెలరేగాడు. ఏకంగా సెంచరీ కొట్టేశాడు. రోహిత్ కెరీర్ లో ఇది 33వ వన్డే సెంచరీ కావడం విశేషం. 125 బంతుల్లో 121 పరుగులు చేసిన రోహిత్ నాటౌట్ గా నిలిచాడు. రోహిత్‌కు తోడుగా మరో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి జట్టు విజయానికి బాటలు వేశాడు. వన్డేల్లో తొలిసారి వరుసగా రెండుసార్లు డకౌట్ అయిన అనుకోని రికార్డుతో బరిలో దిగినప్పటికీ కోహ్లి ఆ ప్రభావమేమీ లేకుండా ఆడాడు. 81 బంతుల్లో అజేయంగా 74 పరుగులు సాధించాడు. ఈ క్రమంలో కోహ్లి వన్డే క్రికెట్లో అత్యధిక పరుగులు సాధించిన బ్యాటర్ గా రికార్డులకెక్కాడు. మొత్తం 305 వన్డేల్లో 14,255 పరుగులు సాధించిన కోహ్లి.. శ్రీలంక దిగ్గజం కుమార సంగక్కర (404 మ్యాచ్ లలో 14234)ను అధిగమించాడు. ఈ జాబితాలో ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచాడు టీమ్ ఇండియా క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ (463 మ్యాచ్ లలో 18,426).

### రెండో స్థానానికి కింగ్ కోహ్లీ

టీమిండియా స్టార్ బ్యాటర్, పరుగుల యంత్రం విరాట్ కోహ్లీ వన్డే ఫార్మాట్‌లో మరో అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. శ్రీలంక దిగ్గజ ఆటగాడు కుమార సంగక్కరను అధిగమించి, వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన రెండో ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. ఆస్ట్రేలియాతో శనివారం సిడ్నీ వేదికగా జరిగిన మూడో వన్డేలో ఈ ఘనత సాధించాడు. ఈ జాబితాలో ప్రస్తుతం మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ మాత్రమే కోహ్లీ కంటే ముందున్నాడు. ఈ మ్యాచ్‌కు ముందు తొలి రెండు వన్డేల్లో పెద్దగా రాణించలేకపోయిన కోహ్లీ, కీలకమైన ఆఖరి మ్యాచ్‌లో తనదైన శైలిలో చెలరేగాడు. ఈ క్రమంలోనే 14,234 పరుగులతో రెండో స్థానంలో ఉన్న సంగక్కర రికార్డును తన 293వ ఇన్నింగ్స్‌లోనే బద్దలు కొట్టాడు. వన్డే క్రికెట్‌లో సచిన్ టెండూల్కర్ 18,426 పరుగులతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అయితే, ఈ జాబితాలోని టాప్ 10 ఆటగాళ్లలో ఎవరికీ లేనంత పరుగుల సగటు (57.69) కోహ్లీ సొంతం కావడం విశేషం. సచిన్ సగటు 44.83గా ఉంది. ఇక మ్యాచ్ విషయానికొస్తే, ఛేదనలో కోహ్లీ మరోసారి తన మార్క్ చూపించాడు. అజేయంగా 74 పరుగులు చేసి, తన వన్డే కెరీర్‌లో 75వ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.





### ఆస్పత్రికి అయ్యర్

టీమిండియా స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ గాయపడ్డాడు. ఆస్ట్రేలియాతో సిడ్నీలో జరిగిన మూడో వన్డేలో ఫీల్డింగ్ చేస్తూ గాయపడటంతో, అతడిని మెరుగైన వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తరలించారు. ఈ విషయాన్ని బీసీసీఐ ధృవీకరించింది. ఆస్ట్రేలియా ఇన్నింగ్స్‌లో 33వ ఓవర్లో ఈ ఘటన చోటుచేసుకుంది. హర్షిత్ రాణా బౌలింగ్‌లో బ్యాటర్ అలెక్స్ కేరీ కొట్టిన బంతి గాల్లోకి లేచింది. బ్యాక్‌వర్డ్ పాయింట్‌లో ఫీల్డింగ్ చేస్తున్న అయ్యర్, పరిగెత్తుతూ డైవ్ చేసి అద్భుతమైన క్యాచ్ అందుకున్నాడు. అయితే, ఈ క్రమంలో కిందపడటంతో అతడి ఎడమ పక్కటెముకలకు గాయమైంది. క్యాచ్ పట్టిన వెంటనే అయ్యర్ నొప్పితో విలవిలలాడాడు. టీమ్ ఫిజియో కమలేష్ జైన్, సహచర ఆటగాళ్ల సహాయంతో అయ్యర్ మైదానాన్ని వీడాడు. ఆ తర్వాత మళ్లీ ఫీల్డింగ్‌కు రాలేదు. "ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో శ్రేయస్ అయ్యర్ ఎడమ పక్కటెముకలకు గాయమైంది. గాయం తీవ్రతను అంచనా వేయడానికి అతడిని ఆసుపత్రికి తరలించాం" అని బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. కీలక సమయంలో అతను గాయపడటం టీమిండియాకు ఎదురుదెబ్బగా మారింది. రాబోయే నెలల్లో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్‌తో స్వదేశంలో వన్డే సిరీస్‌లు ఉన్న నేపథ్యంలో అతని ఫిట్‌నెస్ జట్టుకు కీలకం కానుంది.

## ఆసీస్ మహిళా జట్టుకు బీసీసీఐ క్షమాపణ

మహిళల వన్డే ప్రపంచకప్ కోసం భారత్‌కు వచ్చిన ఆస్ట్రేలియా జట్టుకు ఇండోర్‌లో దారుణ అనుభవం ఎదురైంది. ఇద్దరు ఆస్ట్రేలియా మహిళా క్రికెటర్ల పట్ల ఓ వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించి వేధింపులకు పాల్పడటం తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై ప్రపంచవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తగా, బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తీవ్రంగా స్పందిస్తూ ఇది చాలా దురదృష్టకరమని, క్షమాపణలు కోరుతున్నామని తెలిపారు. వివరాల్లోకి వెళితే, ఇండోర్‌లో తమ హోటల్ నుంచి సమీపంలో ఉన్న కేఫ్‌కు నడుచుకుంటూ వెళుతున్న ఇద్దరు ఆస్ట్రేలియా క్రీడాకారిణులను మోటార్‌సైకిల్‌పై వచ్చిన ఓ వ్యక్తి అసభ్యంగా తాకాడు. ఈ అవమానకరమైన చర్యతో ఆస్ట్రేలియా జట్టు యాజమాన్యం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది.




దక్షిణాఫ్రికాతో కీలక మ్యాచ్ కోసం ఇండోర్‌లో ఉన్న జట్టుకు ఈ ఘటన తర్వాత అదనపు భద్రతను కల్పించారు. మరోవైపు, ఈ ఘటన భారత్‌లో మహిళా క్రీడాకారుల భద్రతపై అంతర్జాతీయంగా మరోసారి ఆందోళనలకు దారితీసింది. ఈ సంఘటనపై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పందిస్తూ, "ఇది చాలా దురదృష్టకరమైన సంఘటన. భారత్ ఎంతో మెరుగైన ఆతిథ్యం ఇచ్చే దేశం, ఇలాంటిది జరుగుతుందని ఎవరూ ఊహించలేదు. మన దేశానికి వచ్చిన అతిథులకు ఇలా జరిగి ఉండాల్సింది కాదు. ఈ ఘటనకు మేం చింతిస్తున్నాం" అని అన్నారు. నిందితుడిని త్వరగా పట్టుకున్నందుకు పోలీసులను అభినందించిన ఆయన, చట్టప్రకారం దోషికి కఠిన శిక్ష పడుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. "ప్రపంచకప్‌లో పాల్గొంటున్న అన్ని జట్లకు ఇప్పటికే భద్రత ఉన్నప్పటికీ, దాన్ని మరింత పటిష్టం చేస్తాం. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూస్తాం" అని ఆయన హామీ ఇచ్చారు. భారత మాజీ క్రికెటర్ రీమా మల్హోత్రా కూడా ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. మన దేశంలో 'అతిథి దేవో భవ' అంటాం. ఆ మాటను పాటించాలి. ఇలాంటి నీచ మనస్తత్వం ఉన్నవారికి గుణపాఠం కావాలి. దోషికి కఠిన శిక్ష విధించాలి. మహిళలను గౌరవించాలని అందరూ తెలుసుకోవాలి. జరిగిన ఘటన నన్ను తీవ్రంగా బాధించింది" అని ఆమె అన్నారు. పోలీసులు ఈ ఘటనపై వేగంగా స్పందించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఆస్ట్రేలియా జట్టుకు భద్రతను పెంచామని, మిగిలిన ప్రపంచకప్ మ్యాచ్‌లు సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు బీసీసీఐ స్పష్టం చేసింది.



## ఆస్ట్రేలియాతో భారత్ అమీతుమీ!

**మహిళల వరల్డ్ కప్‌లో దక్షిణాఫ్రికా ఘోర పరాజయం**

మహిళల వన్డే ప్రపంచకప్‌లో సెమీ ఫైనల్స్ సమీకరణాలు స్పష్టమయ్యాయి. శనివారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చేతిలో దక్షిణాఫ్రికా ఘోరంగా ఓడిపోవడంతో.. సెమీస్‌లో టీమిండియా ఎవరితో తలపడనుందో తేలిపోయింది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న ఆస్ట్రేలియాతో భారత్ అక్టోబర్ 30న సెమీ ఫైనల్‌లో అమీతుమీ తేల్చుకోనుంది. ఇండోర్‌లో జరిగిన నేటి లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా బౌలర్ అలానా కింగ్ (7/18) తన స్పిన్‌తో మాయ చేసింది. ఆమె ధాటికి సౌతాఫ్రికా బ్యాటింగ్ లైనప్ పేకమేడలా కూలింది. కేవలం 24 ఓవర్లలో 97 పరుగులకే సఫారీ జట్టు ఆలౌట్ అయింది. లారా వోల్వార్ట్ (31), సినాలో జాఫ్తా (29), నాడిన్ డిక్లర్క్ (14) మినహా మరే బ్యాటర్ రెండంకెల స్కోరు చేయలేకపోయారు. 98 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా సులువుగానే విజయాన్ని అందుకుంది. ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (5), ఎలిస్ పెర్రీ (0) త్వరగా ఔటైనప్పటికీ, జార్జియా వాల్ (38లి), బెత్ మూనీ (42) బాధ్యతగా ఆడి జట్టును గెలిపించారు. 16.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఆసీస్ లక్ష్యాన్ని ఛేదించింది. ఈ విజయంతో ఆస్ట్రేలియా 7 మ్యాచ్‌లలో 6 విజయాలు, 13 పాయింట్లతో టేబుల్ టాపర్‌గా నిలిచింది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఆస్ట్రేలియా (13), దక్షిణాఫ్రికా (10), ఇంగ్లాండ్ (9), భారత్ (6) తొలి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. ఆదివారం బంగ్లాదేశ్‌తో జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ గెలిచినా 8 పాయింట్లతో నాలుగో స్థానంలోనే ఉంటుంది. దీంతో నిబంధనల ప్రకారం, ఒకటో స్థానంలో ఉన్న ఆస్ట్రేలియాతో, నాలుగో స్థానంలో ఉన్న భారత్ సెమీస్‌లో తలపడటం ఖాయమైంది. ప్రపంచ ఛాంపియన్ అయిన ఆసీస్‌తో సెమీస్ పోరు భారత్‌కు పెద్ద సవాల్‌గా మారనుంది. ఈ కీలక మ్యాచ్‌లో కెప్టెన్ స్మృతి మంధన, హర్మన్‌ప్రీత్ కౌర్ వంటి కీలక ప్లేయర్లు రాణించడంపైనే జట్టు విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి.

ఈవార్తలు ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
ఆదివారం 26-10-2025 | www.evarthalu.com

# భారత్‌లో.. జమ్మూకశ్మీర్!




భారతదేశంలోని జమ్మూకశ్మీర్ యూనియన్ టెరిటరీలో ప్రతి సంవత్సరం అక్టోబర్ 26న జరుపుకునే ప్రత్యేక దినోత్సవం. ఇది 1947లో మహారాజా హరి సింగ్ భారత డొమినియన్‌తో విలీనం చేసుకున్న రోజును గుర్తుచేస్తుంది. ఈ దినోత్సవం భారతదేశంతో జమ్మూకశ్మీర్ చారిత్రక, రాజకీయ సంబంధాన్ని సూచిస్తుంది , ఐక్యత, శాంతి, ప్రగతిని ప్రోత్సహిస్తుంది. 2020 నుండి ఇది అధికారికంగా పబ్లిక్ హాలిడేగా ప్రకటించబడింది.

చారిత్రక నేపథ్యం1947 ఆగస్టు 15న భారతదేశం, పాకిస్తాన్ స్వాతంత్ర్యం పొందిన తర్వాత, జమ్మూ కశ్మీర్ స్వతంత్రంగా ఉండాలని మహారాజా హరి సింగ్ కోరుకున్నాడు. అయితే, రాష్ట్రంలో హిందూ రాజు, ముస్లిం బహుసంఖ్యకులు ఉండటం వల్ల రాజకీయ అస్థిరత పెరిగింది. అదేసమయంలో అక్టోబర్ 22, 1947న పాకిస్తాన్ మద్దతుతో నార్త్-వెస్ట్ ఫ్రంటియర్ ప్రావిన్స్ నుండి వచ్చిన గిరిజన దండయాత్ర ముజఫరాబాద్, బారాముల్లా మొదలైన ప్రాంతాలను ఆక్రమించింది. ఈ దండయాత్రలో వేలాది మంది మరణించారు, రాష్ట్రం సంక్షోభంలో పడింది. మహారాజా హరి సింగ్ భారత ప్రభుత్వాన్ని సైనిక సహాయం కోరాడు. భారతం సహాయం చేయాలంటే ఆ రాష్ట్రాన్ని భారత్‌లో విలీనం చేయాలని భారత ప్రభుత్వం షరతు విధించింది. దీంతో.. అక్టోబర్ 26, 1947న మహారాజా హరి సింగ్ ఇన్‌స్ట్రుమెంట్ ఆఫ్ యాక్సెషన్ (విలీన ఒప్పందం)పై సంతకం చేశాడు. ఇది భారత స్వాతంత్ర్య చట్టం, 1947 ప్రకారం రూపొందించబడిన చట్టపరమైన డాక్యుమెంట్. ఈ ఒప్పందం ప్రకారం, జమ్మూ కశ్మీర్ భారత్‌లో విలీనమై, రక్షణ, విదేశీ వ్యవహారాలు, సమాచార వ్యవస్థలు మాత్రమే భారత పరిపాలనలోకి వచ్చాయి. మిగిలిన అంశాలు రాష్ట్ర స్వయం ప్రతిపత్తిలో ఉండేవి. అక్టోబర్ 27న భారత గవర్నర్-జనరల్ లార్డ్ మౌంట్‌బాటెన్ ఈ ఒప్పందాన్ని అంగీకరించాడు. అదే రోజు భారత సైన్యం శ్రీనగర్‌లోకి చేరుకుని, దండయాత్రను ఆపింది. ఇది మొదటి ఇండో-పాక్ యుద్ధానికి (1947-48) దారితీసింది, దీని ముగింపులో యుఎన్ మధ్యవర్తిత్వంతో సెప్టెంబర్ 1949లో సెస్‌ఫైర్ జరిగింది. సార్దార్ వల్లభ్‌భాయి పటేల్, వీ.పి. మెనాన్ వంటి నాయకులు ఈ ప్రక్రియలో కీలక పాత్ర పోషించారు. ఈ దినోత్సవం జమ్మూ కాశ్మీర్‌ను భారత యూనియన్‌లో శాశ్వతంగా చేర్చిన చారిత్రక సంఘటనను గుర్తుచేస్తుంది. ఇది భారత దేశీయ ఐక్యతకు, రక్షణ బలగాల త్యాగాలకు గౌరవం చేస్తుంది. 1950లో రాజ్యాంగంలో 370 అధికరణం ద్వారా రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తి ఇవ్వబడింది. 2019లో ఈ అధికరణం రద్దు తర్వాత, జమ్మూ కాశ్మీరు రెండు యూనియన్ టెరిటరీలుగా (జమ్మూ %డ% కశ్మీర్, లడఖ్) పునర్వ్యవస్థీకరించబడింది. ఈ దినోత్సవం ఆ కాలం నుండి ప్రస్తుత ప్రగతి వరకు యాత్రను సూచిస్తుంది. కొందరు కాశ్మీరీ సెపరేటిస్టులు (ఉదా., సయ్యద్ అలీ షా గీలానీ) ఈ రోజును “బ్లాక్ డే”గా గుర్తిస్తారు, విలీనాన్ని “షరతులతో” జరిగినట్టు వాదిస్తారు. అయితే, చట్టపరంగా ఇది పూర్తి విలీనమే.

## ఆర్టికల్ 370 అమలు.. రద్దు

ఆర్టికల్ 370 భారత రాజ్యాంగంలో 1949లో చేర్చబడింది. ఇది జమ్మూ కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి ఇచ్చింది, దీని ద్వారా రాష్ట్రం స్వంత రాజ్యాంగం, జెండా, చట్టాలను కలిగి ఉండేది. రక్షణ, విదేశీ వ్యవహారాలు, సమాచార వ్యవస్థలు మాత్రమే కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉండేవి. 1947 అక్టోబర్ 26న మహారాజా హరి సింగ్ ఇన్‌స్ట్రుమెంట్ ఆఫ్ యాక్సెషన్ ద్వారా జమ్మూ కశ్మీర్‌ను భారత్‌లో విలీనం చేసినప్పుడు, ఈ ప్రత్యేక హోదా షరతుగా ఏర్పడింది. ఆర్టికల్ 370తో పాటు, 1954లో చేర్చిన 35ఏ జమ్మూ కశ్మీర్ శాశ్వత నివాసితులకు ప్రత్యేక హక్కులు (ఉదా., ఆస్తి, ఓటు హక్కు, ఉద్యోగాలు) కల్పించింది. అయితే, ఆర్టికల్ 370 రాష్ట్రాన్ని భారత రాజ్యాంగం నుండి వేరుచేసి, అభివృద్ధిని అడ్డుకుందని, ఇది రద్దు చేయడం ద్వారా రాష్ట్రాన్ని పూర్తిగా భారత్‌లో ఏకీకరణ చేయవచ్చని భారత ప్రభుత్వం వాదించింది. ప్రత్యేక హోదా ఉగ్రవాదానికి, సెపరేటిజానికి మద్దతు ఇస్తోందని, దీనిని రద్దు చేయడం శాంతిని పెంపొందిస్తుందని ప్రభుత్వం అభిప్రాయపడింది. ఆర్టికల్ 35ఏ వల్ల బయటి పెట్టుబడులు, ఆస్తి కొనుగోళ్లు అడ్డంకులు ఎదుర్కొన్నాయి. రద్దు ద్వారా ఆర్థిక అవకాశాలు పెరుగుతాయని భావించింది. శాశ్వత నివాసితుల విధానం వల్ల బయటి వారు, మహిళలు (బయటి వ్యక్తులను వివాహం చేసుకున్నవారు) హక్కులు కోల్పోయారు. రద్దు ద్వారా సమానత్వం సాధ్యమని ప్రభుత్వం పేర్కొంది. దీంతో డిసెంబర్ 2023లో ఆర్టికల్ 370 రద్దుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఆర్టికల్ 370 రద్దుతో దానంతట అదే 35ఏ కూడా రద్దయింది, దీనితో శాశ్వత నివాసితుల హక్కులు రద్దయ్యాయి. ఆర్టికల్ 370 రద్దు అనంతరం బయటి పెట్టుబడులు పెరిగాయి. ఒక్క 2022-23లోనే రూ. 6,000 కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చాయి. ఉగ్రవాద సంఘటనలు కొంత తగ్గినప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో ఇంకా సవాళ్లు ఉన్నాయి.

- విద్యారాణి పూరడి




# ఆమెకు అండ.. గృహ హింస చట్టం

గృహ హింస చట్టం అనేది మహిళలు తమ గృహాల్లో ఎదుర్కొన్న శారీరక, మానసిక, లైంగిక, ఆర్థిక,ఇతర రకాల హింసలకు వ్యతిరేకంగా రక్షణ అందించే చట్టం. భారతదేశంలో ఇది గృహ హింస నుండి మహిళలకు రక్షణ చట్టం-2005 భరోసాను కల్పిస్తుంది. ఈ చట్టం 2005 సెప్టెంబర్ 13న ఆమోదం పొంది, 2006 అక్టోబర్ 26న అమలులోకి వచ్చింది. ఇది మహిళలకు వేధింపుల నుండి రక్షణ కవచంగా పనిచేస్తుంది.

**లక్ష్యాలు:**

- గృహ హింసను శారీరక (కొట్టడం, గాయపరిచ్చడం), మానసిక (తిట్టడం, బెదిరించడం), లైంగిక (బలవంతంగా సంబంధం), ఆర్థిక (డబ్బు కోసం ఒత్తిడి) ఇతర రకాలుగా నిర్వచిస్తుంది.
- బాధిత మహిళలు తమ భర్త లేదా సంబంధితుల ఇంట్లో ఉండే హక్కు, ఆర్థిక సహాయం, పిల్లల సంరక్షణ, వైద్య సహాయం, ఆశ్రయం మొదలైనవి పొందవచ్చు.
- భారతీయ మహిళలకు మాత్రమే (పురుషులు కూడా హింసకు గురవుతారు కానీ, ఐపీసీ 498ఏ వంటి చట్టాలు మహిళలకు ప్రత్యేకం). ఇది దత్తత భార్యలు, విడాకులు తీసుకున్నవారు, లేడీ పార్ట్‌నర్లు మొదలైనవారికి వర్తిస్తుంది.

**సెక్షన్లు**

- సెక్షన్ 2: గృహ హింస నిర్వచనం: శారీరక, మానసిక, లైంగిక, ఆర్థిక హింసలు.
- సెక్షన్ 12:బాధితులు మేజిస్ట్రేట్‌కు ఫిర్యాదు చేయవచ్చు.
- సెక్షన్ 17: మహిళలకు ఉమ్మడి ఆస్తిలో హక్కు (సుప్రీం కోర్టు 2020లో ఇది ధ్రువీకరించింది).
- సెక్షన్ 18-23: రక్షణ ఆర్డర్లు, నివాస హక్కు, ఆర్థిక సహాయం, పిల్లల కస్టడీ మొదలైనవి.
- సెక్షన్ 31: హింస చేసినవారికి జరిమానా లేదా జైలు (గరిష్ట 1 సంవత్సరం).




## ఎలా ఫిర్యాదు చేయాలి?

1. ప్రొటెక్షన్ ఆఫీసర్ (పోలీస్ లేదా ఎన్జీవో) వద్ద ఫిర్యాదు చేయండి.
2. స్వయం సహాయక సమూహాలు లేదా ఉచిత న్యాయ సేవల సహాయం తీసుకోండి.
3. టోల్ ఫ్రీ నంబర్: 1091 (విమెన్ హెల్ప్‌లైన్) లేదా 181 (ఎమర్జెన్సీ).
4. తెలంగాణలో: విమెన్ సేఫ్టీ వింగ్ మొదలైన సంస్థలు కేసులను మానిటర్ చేస్తాయి.



OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.